Crime Mirror
QR Code

https://epaper.
crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
31-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక:49

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

### సోమవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ శాసనసభ

### శాసనసభలో తీర్మానం పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి మన్మోహన్‌సింగ్ చేసిన విశిష్ట సేవలెన్నో..**

**విప్లవాత్మక ఉపాధి హామీ, సమాచార హక్కు విద్యాహక్కు చట్టాలు తెచ్చారు**

**60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేశారు**

**రాష్ట్ర అసెంబ్లీ తరఫున మన్మోహన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటన**

**హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ విగ్రహం పెడతామని వెల్లడి**

హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం దేశ సర్వోన్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర శాసనసభ తరఫున విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా వివిధ హోదాల్లో దేశానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. మన్మోహన్‌కు నివాళి అర్పించేందుకు సోమవారం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది.

2లో



## హైదరాబాద్‌లో సత్య నాదెళ్ల

మర్యాదపూర్వకంగా కలిసిన సిఎం రేవంత్

ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులకు వినతి

# స్పేస్ డాకింగ్ మిషన్‌లో తొలి ఘట్టం జయవంతం



**భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో కీలకమైన 'స్పేస్ డాకింగ్' ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది.**


**రోదసిలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు.. సత్తా చాటిన ఇస్రో**

**15.13 నిమిషాల్లోనే కక్ష్యలోకి చేర్చిన పీఎస్ఎల్వీ-సీ60**

**డాకింగ్ పూర్తయితే అమెరికా, రష్యా, చైనా సరసన భారత్!**

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టి.. ఆపై వాటిని అనుసంధానం చేసే దిశగా చేపట్టిన ప్రయోగంలో తొలి ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. ఈ మిషన్‌లో భాగంగా ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) ఉపగ్రహాలను నింగిలోకి

2లో




## మన్మోహన్ గొప్పతనాన్ని
# గుర్తించిన పివి

**రాజకీయాలకు అతీతంగా ఆర్థిక బాధ్యతలు అప్పగించిన పివి**

**మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలన్న తీర్మానానికి ఆమోదం**

**పివికి కూడా ఢిల్లీలో గుర్తింపు దక్కాలని కోరిన కెటిఆర్**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హాయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది.

2లో



# గేమ్ ఛేంజర్ కానున్న బనకచర్ల

బనకచర్లతో తెలుగుతల్లికి జలహారతి

గోదావరి నీటిని వినియోగించుకునేలా ప్లాన్

నదుల అనుసంధానంతో వృధానీటికి అడ్డుకట్ట

రాయలసీమకు నీటిని అందిస్తే డెల్టాతో పోటీ

ప్రాజెక్టులపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

జగన్‌కు క్రెడిబిలిటీ లేదని విమర్శలు

2లో

**అమరావతి,హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లేనని,

2లో

# పేర్ని నాని తప్పులే..వారి కుటుంబాన్ని వీధుల్లో పడేసింది

**బియ్యం మాయం నిజం..డబ్బులు కట్టిందీ నిజమే కదా**

**గత ప్రభుత్వం కన్నా కూటామి బాగా పనిచేస్తోంది**

**నాగబాబును ముందుగా ఎమ్మెల్సీగా చేస్తాం**

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ**

**గుటూరు, (క్రైమ్ మిర్రర్):** రేషన్ బియ్యం మాయమైంది నిజం.. డబ్బులు కట్టింది వాస్తవం.. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.


2లో

# దేశం శోకసంద్రంలో ఉంటే రాహుల్ ఎక్కడ

న్యూ ఇయర్ వేడుకల కోసం వియత్నాం వెళ్లారు

బిజెపి నేత ఎక్స్ వేదికగా విమర్శలు

2లో



# ఫ్లైఓవర్లు బంద్

డిసెంబర్ 31న రాత్రి 10 తర్వాత వాహనాలకు అనుమతి లేదు

డ్రగ్స్ సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు

2లో

# తొక్కిసలాట ఘటన బాధాకరం

# హైదరాబాద్‌లో సత్య నాదెళ్ల

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని మైక్రోసాఫ్ట్ సిఇవో సత్యనాదెళ్లను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. సత్య నాదెళ్లను ఆయన నివాసంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీలో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ ప్రతిపాదనలు.. ఏఐ సిటీలో ఆర్‌అండ్‌డీ ఏర్పాటుకు సహకారంపై చర్చించారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చర్చిస్తూ.. క్లౌడ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కీలక పాత్ర పోషించాలని సీఎం కోరారు. ఓపెన్ ఏఐ నుంచి ఉచిత క్రెడిట్ ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నాలుగు డేటా సెంటర్లు, హైదరాబాద్ కేంద్రంగా విస్తరణ తదితర అంశాలపై సీఎం చర్చించారు. ఐటి సెక్రటరీ జయేష్ రంజన్ కూడా వీరివెంట సీఈవో సత్యనాదెళ్లను కలిశారు. సత్య నాదెళ్ల వ్యక్తిగత పర్యటన కోసం ఇండియాకు వచ్చారు. ఆయన స్వస్థలం హైదరాబాద్. బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో ఉన్న సత్య నాదెళ్ల ఉన్నారు. ఆయనను అధికారికంగా కాకుండా మర్యాదపూర్వకంగా ప్రభుత్వ పెద్దలు కలిసినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో సాఫ్ట్ వేర్ రంగ అభివృద్ధి కోసం సత్యనాదెళ్ల సూచనలు, సలహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగినట్లుగా తెలుస్తోంది. సత్య నాదెళ్ల హైదరాబాద్‌లో చదువుకుని ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. ఆయన తండ్రి యుగంధర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన కొంత కాలం క్రితం చనిపోయారు. లో ప్రొ÷ల్ ఇష్టపడే సత్య నాదెళ్ల ఎక్కువ హంగామా చేయరు. హైదరాబాద్ వచ్చిన విషయం తెలియడంతో ప్రభుత్వ పెద్దలు ఆయనను కలవాలని ఆసక్తి చూపించడంతో అంగీకరించినట్లుగా తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ సీఈవోగా అధికారికంగా పర్యటనలకు గతంలో వచ్చారు.

# మన్మోహన్ గొప్పతనాన్ని గుర్తించిన పివి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ప్రధాని మాన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని అన్నారు. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శిలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చిక్కుముడి ఏర్పడింది.

# ఫ్లైఓవర్లు బంద్

హైదరాబాద్: న్యూ ఇయర్ వేడుకలకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఈసారి కొత్త సంవత్సరాన్ని శాంతి భద్రతల నడుమ జరపాలని తగిన భద్రతా చర్యలు చేపడుతున్నారు. బైక్ రేసులు, అతివేగంతో దూసుకెళ్లే ప్రమాదం పొంచి ఉండటంతో నగరంలోని అన్ని ఫ్లై ఓవర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో డిసెంబర్ 31న రాత్రి 10 గంటల తర్వాత ద్విచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాలకు ఫ్లై ఓవర్ల మీదకు అనుమతి ఉండదు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు మాత్రం తగిన ఆధారాలు చూపిస్తే పీవీఎన్‌ఆర్ ఫ్లై ఓవర్ మీదికి అనుమతి ఇస్తారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని రాచకొండ కమిషనర్ స్యుదీర్ బాబు సూచించారు. ఔట్ డోర్ కార్యక్రమాలు జరిగే చోట డీజేలకు అనుమతి లేదన్నారు. ఎటువంటి బాణసంచా కాల్చడానికి వీల్లేదని, ఈవెంట్లలోకి పరిమితికి మించి ప్రేక్షకులను అనుమతించకూడదని ఆయన పేర్కొన్నారు. మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా నిరోధించడానికి షీ టీమ్ బృందాలు విధుల్లో ఉంటాయన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి తనిఖీలు చేస్తామని చెప్పారు. నిషేధిత డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

# దేశం శోకసంద్రంలో ఉంటే రాహుల్ ఎక్కడ

న్యూఢిల్లీ,డిసెంబర్30(ఆర్ఎన్ఎ):మన్మోహన్ సింగ్ మరణానంతరం పలు అంశాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య వివాదం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీపై బీజేపీ విరుచుకుపడింది. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఒకవైపు దేశం మొత్తం సంతాపం వ్యక్తం చేస్తోందని బీజేపీ పేర్కొంది. మరోవైపు రాహుల్ గాంధీ నూతన సంవత్సర వేడుకల కోసం వియత్నాం వెళ్లారని ఆరోపించింది. మన్మోహన్ సింగ్ చితాభస్మ నిమజ్జనానికి కాంగ్రెస్, గాంధీ కుటుంబానికి చెందిన వారు ఎవరూ హాజరు కాలేదని బీజేపీ విమర్శించింది.బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వియా రాహుల్ గాంధీని విమర్శిస్తూ.. ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో యావత్ దేశం శోకసంద్రంలో మునిగిపోయింది. మరోవైపు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ వియత్నాం వెళ్లారు. మాజీ ప్రధాని మరణంపై రాహుల్ గాంధీ రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ ప్రయోజనాల కోసం ఆయన మరణాన్ని కూడా ఉపయోగించుకున్నారు. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ సిక్కులను ద్వేషిస్తున్నాయి. ఇందిరా గాంధీ దర్బార్ సాహిబ్‌ను అవమానించిన తీరును మర్చిపోవద్దు' అని రాసుకొచ్చారు.


# స్పేస్ డాకింగ్ మిషన్‌లో తొలి ఘట్టం జయవంతం

(మొదటి పేజీ తరువాయి)

సూళ్లూరుపేట: భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో కీలకమైన 'స్పేస్ డాకింగ్' ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. స్పేస్ డాకింగ్ కోసం భారత అంతరిక్ష పరిశోధనల కేంద్రం ఇస్రో చేపట్టిన జంట ఉపగ్రహాల ప్రయోగం (స్పేడెక్స్)లో తొలి అడుగు ఘనంగా పడింది. ఈ మిషన్‌లో భాగంగా చేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్.. వాటిని జాగ్రత్తగా నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. వాస్తవానికి ఈ ప్రయోగాన్ని సోమవారం రాత్రి 9.58 గంటలకు నిర్వహించాల్సి ఉంది. కానీ.. అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ కారణంగా రెండు నిమిషాలు ఆలస్యంగా నిర్వహించారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 10:15 గంటలకు నింగిలోకి ఎగిరిన రాకెట్.. నిర్ణీత షెడ్యూలు ప్రకారం తొలి ఉపగ్రహాన్ని 15.10 నిమిషాలకు, రెండో ఉపగ్రహాన్ని 15.13 నిమిషాలకు భూమికి 476 కిలోమీటర్ల ఎత్తున, వృత్తాకార కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టింది. దీంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్ స్పేడెక్స్ మిషన్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇక ఈ ప్రయోగంలో అసలు సిసలైన ఘట్టం.. డాకింగ్ (రెండు ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ) మిగిలి ఉంది. చందమామపైకి మన వ్యోమగాములను పంపి, అక్కడి మట్టి ఇక్కడికి తీసుకురావాలన్నా, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించుకోవాలన్నా.. ఇలా భవిష్యత్తులో చేపట్టబోయే పలు కీలక ప్రయోగాలకు అత్యంత కీలకమైనది డాకింగ్ పరిజ్ఞానం. ప్రస్తుతానికి అమెరికా, రష్యా, చైనా అంతరిక్ష పరిశోధనల సంస్థల వద్ద మాత్రమే ఈ పరిజ్ఞానం ఉంది.పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ మోసుకెళ్లిన రెండు ఉపగ్రహాల్లో ఒకటి.. ఎస్‌డీఎక్స్01 (చేజర్) కాగా, మరొకటి ఎస్‌డీఎక్స్02 (టార్గెట్). ఒక్కో దాని బరువు సుమారు 220 కేజీలు. ఈ ఉపగ్రహాలతోపాటు.. పీఎస్ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్) ద్వారా మరో 24 పేలోడ్లను కూడా ఇస్రో రోదసిలోకి పంపింది. ఆ పేలోడ్ల ద్వారా అనేక ప్రయోగాలు చేపట్టేందుకు ఇస్రో ప్రణాళికలు రచించింది.

**జనవరిలో మరిన్ని..**

వచ్చే ఏడాది జనవరిలో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. పీఎస్ఎల్వీ రాకెట్ నావిగేషన్ రెండో సిరీస‌లో ఎన్‌వీఎస-02 ఉపగ్రహాన్ని పంపనున్నామని వెల్లడించారు. జనవరి మూడో వారంలో జీఎస్ఎల్వీ-ఎఫ్15 ప్రయోగం ఉంటుందన్నారు. ఇది కాకుండా.. గగన్‌యాన్-జీ1 ద్వారా మావనరహిత ప్రయోగం ఉంటుందని చెప్పారు. 2025లో షార్ నుంచి మరిన్ని



ప్రయోగాలు చేపడతామని తెలిపారు. పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోమవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆయన దర్శించుకొన్నారు. పూజలు చేశారు. అంతకుముందు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో ఇస్రో అధికారులు పీఎస్ఎల్వీ-సీ60 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భారత్‌కు ప్రయోజనం ఏమిటి..?**

అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే లక్ష్యంతో భారత్ గగన్‌యాన్ ప్రాజెక్టు చేపట్టనుంది. చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి వాటిని భూమి మీదకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2035 నాటికి సొంతంగా అతరిక్ష కేంద్రాన్ని నిర్మించే దిశగా ముందుకు సాగుతోంది. అయితే అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి అవసరమైన వాటిని ఒకేసారి రాకెట్‌లో తరలించడం కుదరదు. కాబట్టి వాటిని విడతలవారీగా కక్ష్యలోకి చేర్చి వాటిని డాకింగ్ ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎసఎస్) ఇలాగే ఏర్పాటుచేశారు. స్పేస్ స్టేషన్లకు వ్యోమగాములను, వస్తువులను తీసుకెళ్లే వ్యోమనౌకలను సైతం డాకింగ్ ద్వారానే అనుసంధానం చేస్తారు. అలాగే కక్ష్యలోని ఉపగ్రహాలకు మరమ్మతులు చేపట్టాలన్నా, ఇంధనం నింపాలన్నా, వాటిని ఆధునీకరించాలన్నా.. డాకింగ్ వ్యవస్థ ఉపయోగపడుతుంది.

**లక్ష్యం పూర్తికాగానే అన్‌డాకింగ్..**

డాకింగ్‌కు సంబంధించిన ప్రయోగాలు పూర్తికాగానే ఈ రెండు ఉపగ్రహాలు విడిపోతాయి. దీన్నే అన్‌డాకింగ్ అంటారు.

# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం రేవంత్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి మాట్లాడారు. మాజీ ప్రధాని కుటుంబ సభ్యులకు సభ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సభలో రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. "ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్. 1991%-%96 మధ్య మన పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రిగా భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. ఆర్థిక స్థితిగతుల దశదిశను మార్చిన సంస్కరణల అమల్లో కీలక పాత్ర పోషించారు. ఆ పునాదులతోనే నేడు భారతదేశం ప్రపంచంతో పోటీపడుతోంది. ఆయన దార్శనికత, కృషిని అంతా స్మరించుకోవాలి. మన్మోహన్‌సింగ్ దేశానికి, ప్రత్యేకంగా తెలంగాణకు చేసిన సేవలకు శాసనసభ అపార కృతజ్ఞతలు తెలియజేస్తోంది. 4 కోట్ల తెలంగాణ ప్రజలు ఆయనకు రుణపడి ఉన్నారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన మాటను పార్లమెంటరీ ప్రక్రియలో నెరవేర్చిన గొప్ప నేత మన్మోహన్. రాజ్యసభలో రాజ్యాంగ సవరణపై వచ్చిన చర్చలో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతుందన్న గందరగోళ పరిస్థితి ఏర్పడినప్పుడు మన్మోహన్ వ్యూహాత్మకంగా ప్రకటన చేయడంతోనే తెలంగాణ ఏర్పడింది. నాటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఆయనతో మాట్లాడి సమన్వయపర్చారు. రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా, తెలంగాణ బిల్లును ఉభయ సభల్లో ఆమోదింప జేసిన సారథిగా ఆయనను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. తెలంగాణ ప్రజల తరఫున రాజకీయాలు, పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలపడమే కాకుండా ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజలు సోనియాకు ఎంత రుణపడి ఉంటారో మన్మోహన్‌కూ అంతే రుణపడి ఉంటారు. గొప్ప ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆవిష్కరించుకుందాం. ఆయన వర్ధంతి, జయంతి కార్యక్రమాలు చేసుకుందాం. నేను మన్మోహన్ మరణవార్త తెలిసి హుటాహుటిన ఢిల్లీ వెళ్లి ఆయన కుటుంబాన్ని కలిసి తెలంగాణ సీఎంగా పరిచయం చేసుకున్నాను. మన్మోహన్ సతీమణి నాతో మాట్లాడారు. 'మన్మోహన్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇచ్చారు. ఆయనకు తెలంగాణ పట్ల ప్రత్యేక అభిమానం ఉంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి, ఆయన ఆశీస్సులు మీకు ఉంటాయి.' అని ఆమె చెప్పారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన మన్మోహన్.. తన కుటుంబాన్ని అత్యంత నిరాడంబరంగా నడిపించారు. ఆయనను కోల్పోవడం వారి కుటుంబానికే కాదు యావత్ దేశానికి, ప్రపంచానికి తీరని లోటు. మౌనంగా ఉంటారని, మౌన ముని అని, యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ అని రకరకాలుగా విమర్శించినా సహనాన్ని కోల్పోకుండా పనినే ధ్యాసగా, జీవిత లక్ష్యంగా చేసుకున్న గొప్ప వ్యక్తి మన్మోహన్. నేను, ఉత్తమ్, కోమటిరెడ్డి ఎంపీలుగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో ధర్నా చేస్తుంటే.. మన్మోహన్ కూడా మా మధ్య కూర్చుని నిరసన తెలిపారు. మాకు జీవితకాలం గుర్తుండిపోయే ఘటన అది.

**గొప్ప మానవతావాదం చూపారు**

ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యా హక్కు, ఆహార భద్రత వంటి నిర్ణయాలతో మన్మోహన్ చరిత్ర సృష్టించారు. గతంలో ప్రభుత్వాలు యజమానులతో సంబంధం లేకుండా భూములను తీసుకునేవి. కానీ కేవలం భూమి కోల్పోయేవారికే కాకుండా కులవృత్తులు, చేతువృత్తులపై ఆధారపడిన వారు, ఇళ్లు లేనివారికి సహాయ పునరావాసం అందేలా 2013లో భూసేకరణ చట్టం తెచ్చి గొప్ప మానవతావాదం చూపించారు. 2006లో అటవీ హక్కుల చట్టాన్ని తీసుకురావడంతో ఆదివాసులు, గిరిజనులకు పోడుభూములకు పట్టాలు ఇవ్వగలుగుతున్నాం. గొప్ప పరిపాలన అందించడానికి అంబేద్కర్ రాజ్యాంగం ఇచ్చి పునాదులు వేయగా.. ఆ స్ఫూర్తితో మన్మోహన్ చట్టాలు తెచ్చి ప్రజలకు మేలు చేశారు.." అని సీఎం రేవంత్ కొనియాడారు.

# గేమ్ ఛేంజర్ కానున్న బనకచర్ల

ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుందని చెప్పారు. నీటిలభ్యతను బట్టి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్‌కు రోజుకు కనీసం 2 టీఎంసీలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి 'గేమ్ ఛేంజర్' అవుతుంది. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లేనని వివరించారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుంది. రాష్ట్రంలో అదనపు ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. గోదావరి - బనకచర్ల పూర్తయితే తెలుగుతల్లికి జలహారతి ఇచ్చినట్లే. తెలుగు రాష్ట్రాల్లో 90శాతం ప్రాజెక్టులు తెదేపా హయాంలో చేపట్టినవేనని చంద్రబాబు తెలిపారు. దాదాపు అన్ని ప్రాజెక్టులు తెదేపా అధికారంలో ఉన్నప్పుడే చేపట్టామన్నారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో తెలుగు గంగ ప్రాజెక్టుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో శ్రీశైలం నుంచి కెనాల్ ద్వారా తెలుగుగంగకు నీళ్లు ఇవ్వడానికి ఎన్టీఆర్ సిద్ధమని చెప్పారన్నారు. అలా రాయలసీమకు తెలుగుగంగ నీళ్లు తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.'వెలిగొండ, తోటపల్లి ప్రాజెక్టులు నేనే ప్రారంభించాను. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి కొరత, వర్ష పాతం ఎక్కువ. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కరవు వల్ల సాగు దెబ్బతింటోంది. నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమను రత్నాలసీమగా చేయవచ్చు. గతంలో అనంతపురంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉండేది. ఉద్యాన పంటలతో ఆ జిల్లాలో తలసరి ఆదాయం 4-5 శాతానికి చేరింది. పట్టిసీమ చేపట్టిన తర్వాత సరైన సమయానికి పంటలు చేతికి అందే పరిస్థితి వచ్చింది. కృష్ణాలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో నీటి ప్రవాహం ఉంది. కృష్ణా నది నుంచి 2,989 టీఎంసీల వరద ప్రవాహం సముద్రంలోకి వెళ్తోంది. నదుల అనుసంధానంతో కరవు, వరద పరిస్థితులు ఎదుర్కోవచ్చు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి నుంచి కృష్ణాకు కనీసం 200 టీఎంసీలు తీసుకురావాలన్నారు. ఈ ఏడాది 4,114 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్లాయి. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం రిజర్వాయర్లలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి 1 నాటికి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండటం రికార్డు. ఖరీఫ్ పంటలకు ముందస్తుగా నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. వరదలు, తుపానుల కంటే ముందుగా పంట చేతికి వచ్చే వీలుంది' అని చంద్రబాబు తెలిపారు.మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టాం. పోలవరం నుంచి కృష్ణా నదికి నీరు మళ్లించడం మొదటి దశ. రెండో దశలో బొల్లాపల్లి జలాశయం నిర్మించి నీళ్లు తరలిస్తాం. మూడోదశలో బొల్లాపల్లి నుంచి బనకచర్లకు నీటిని మళ్లిస్తాం. రాయలసీమకు బనకచర్ల గేట్‌వే కానుంది. ఈ ప్రాజెక్టుతో సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది.

# పేర్ని నాని తప్పలే..వారి కుటుంబాన్ని వీధుల్లో పడేసింది

సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.. అని నిలదీశారు. మంగళగిరిలో పవన్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'వైకాపా నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయి. అప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? అని అన్నారు. గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు, పనిచేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నాం. పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ఇప్పటివరకు దృష్టి పెట్టాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఎన్డీఏ ఆధ్వర్యంలో చాలా బాధ్యతతో పనిచేస్తున్నాం. పదవులు అనుభవించడం కాదు.. బాధ్యతతో పనిచేస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. రాజకీయాల్లో పని తీరే ప్రామాణికమని, కలిసి పనిచేసిన వారిని గుర్తించాల్సిన బాధ్యత తనకు ఉందని పవన్‌కల్యాణ్ అన్నారు. సోదరుడు, జనసేన నాయకుడు అయిన నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చే విషయమై స్పందించారు.

# తొక్కిసలాట ఘటన బాధాకరం

అమరావతి: హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ వద్ద పుష్ప-2 బెనిఫిట్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్టపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిసారి స్పందించారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ సమానమేనని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే అల్లు అర్జున్ తరఫున బాధిత కుటుంబం వద్దకు వెళ్లి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వైసీపీ విధానాల తరహాలో వ్యవహరించలేదన్నారు. రేవంత్ రెడ్డి గట్టి నాయకుడని, కిందిస్థాయి నుంచి ఎదిగారని ప్రశంసించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. "అల్లు అర్జున్ థియేటర్‌కు వెళ్లే ముందు తగిన ఏర్పాట్లు చేసుకుని ఉండాల్సింది. హీరో అభివాదం చేయకపోతే పొగరని అనుకుంటారు. అభివాదం చేయడం ఎంజాయ్ చేయడం కాదు.. అభిమానులకు భరోసా కల్పించడం. తొక్కిసలాట ఘటన బా?ధాకరమైనది.

## ఫార్ములా కేసులో అత్యుత్సాహం ఎందుకో

### ఇడి నోటీసు అందిందన్న కెటిఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఈడీ ద్వారా నోటీస్ వచ్చింది..దానిలో ఏమి అనుమానం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేపు కోర్టు లో చెబుతా.. ఏ కేసులో దూకుడుగా లేని ఈడీ? ఈ కేసులో మాత్రం అత్యుత్సాహం చూపిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. నేను ఎఫ్ఐఆర్ ను సవాల్ చేస్తున్నాను.. కోర్టు ఏమి చెబుతోంది.. కోర్టు చెబితే ఈడీ, ఏసీబీ ఇక ఏది కూడా ఉండదు కదా అన్నారు. మన్మోహన్ సింగ్ కోసం ప్రత్యేక సమావేశం పెట్టారు..పీవీ ని కూడా గౌరవించాలన్నారు. పీవీ కి కూడా న్యాయం జరిగే దాకా కొట్లాడతామన్నారు. 2025 సంవత్సరం లో కమిటీ లు ఉంటాయి, సంస్థాగత నిర్మాణం ఉంటుందన్నారు. సభ్యత నమోదు ఉంటుందన్నారు. అధ్యక్షుడు ఎన్నిక కూడా ఉంటుందని కేటీఆర్ అన్నారు. బహిరంగ సభ పై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రక్షణ కవచం లాగా ఇక్కడ బీజేపీ ఎంపీ లు, కేంద్ర మంత్రులు ఉన్నారని తెలిపారు. అందుకే అమృత్ టెండర్ లపై కేంద్రం నోరు విప్పట్లేదన్నారు. పనికి మాలిన కేస్ లు పెడుతున్నారని మండిపడ్డారు కేటీఆర్. అక్రమ కేస్ లు పెట్టి బెదిరించాలని చూస్తున్నారని అన్నారు. నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.. మంత్రి గా నిర్ణయం తీసుకున్నాను అని మొదటి రోజు చెప్పానని ..ఇప్పుడు కూడా అదే మాటకు చెప్తున్నానని తెలిపారు. ఏఫ్ఐఆర్ లో తప్పులు ఉంటే ఎన్నికల కమిషన్ ని అడగండి అన్నారు. రేపు కోర్ట్ ముందుకు వస్తుంది.. అందుకే నేను ఎక్కువగా మాట్లాడను అన్నారు. దీనిలో అవినీతి జరగలేదు అని వాళ్లకు కూడా తెలుసని కేటీఆర్ అన్నారు. మొన్న సీఎం చిట్ చాట్ లో కూడా అవినీతి ఎక్కడ జరిగింది అంటే.. చెప్పలేక పోయారని కేటీఆర్ గుర్తుచేశారు.

## ఎట్టకేలకు తెలంగాణ ప్రతినిధులకు గౌరవం

### పాక్షికంగా లేఖలకు అనుమతి: ఛైర్మన్

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించడంపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం సీఎంతో బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబుతో చర్చించారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలు అనుమతించేందుకు చంద్రబాబు అంగీకరించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. వారానికి రెండు బ్రేక్ దర్శనాలు, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలు అనుమతించేందుకు సీఎం అనుమతి ఇచ్చారని బీఆర్ నాయుడు వెల్లడించారు.

## కుంభమేళాకు ప్రత్యేక రైలు ప్యాకేజీలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లాలనుకునే వారికి దక్షిణమధ్యరైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. ఇప్పటికే ప్రయాగ్ రాజ్ లో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. గంగా.. యమునా.. సరస్వతి నదులు కలిసే ప్రదేశంలో స్నానం చేస్తే జన్మ .. జన్మల పాపాల నుంచి విముక్తి లభిస్తుందని హిందువులు నమ్ముతుంటారు. తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తులకు ఐఆర్‌టిసి ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టింది.కుంభమేళా టూర్ ప్యాకేజీలో 8 రోజుల ( 7 రాత్రులు) పర్యటనలో మూడు పుణ్య క్షేత్రాలను సందర్శించుకోవచ్చు. సికింద్రాబాద్ నుంచి బయలు దేరే ఈరైలు తెలుగు రాష్ట్రాల మీదుగా కాశీ.. అయోధ్య.. ప్రయాగ్ రాజ్ వెళ్తుంది. జనవరి 19 తేదీన సికింద్రాబాద్ లో ఈ ట్రైన్ ప్రారంభమవుతుంది. ఈ ట్రైన్ లో మొత్తం 576 సీట్లు ఉండగా వాటిలో స్లీపర్ 320.. థర్డ్ ఏసీ 206.. సెకండ్ ఏసీ 50 ఉన్నాయి. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో బోర్డింగ్.. డీబోర్డింగ్ కు అవకాశం ఉంటుంది.

## మన్మోహన్ విజినరీ లీడర్: వివేక

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మన్మోహన్ సింగ్ ఒక విజనరీ లీడర్ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. అసెంబ్లీలో మన్మోహన్ మృతిపై సంతాప తీర్మానం సందర్భంగా మాట్లాడిన వివేక్.. దేశ రూపురేఖలు మార్చడంలో మన్మోహన్ కీ రోల్ పోషించారని చెప్పారు. మన్మోహన్ కు కాకా వెంకటస్వామికి మంచి అనుభందం ఉందన్నారు. రామగుండం ఫ్యాక్టరీ రీ ఓపెన్ కావడంలో మన్మోహన్ పాత్ర ఉందన్నారు. మన్మోహన్ హయాంలో దేశ జీడీపీ గ్రోత్ 8 ఉందన్నారు ఎమ్మెల్యే వివేక్. 2008లో ప్రపంచంలోని ఆర్థిక మాంధ్యం ఎఫెక్ట్ భారత్ పై పడలేదన్నారు. మన్మోహన్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అని ఒబామా అన్నారని చెప్పారు. మన్మోహన్ హయాంలోనే యూఎస్ ట్రేడ్ పెరిగిందన్నారు వివేక్. మన్మోహన్ వల్లే ఐదు ట్రిలియన్ ఎకానమి వైపు భారత్ పయనిస్తుందన్నారు. మన్మోహన్ సింగ్ వల్లే దేశంలో 2011 వరల్డ్ కప్ నిర్వహించారు.. క్రికెట్ మ్యాచ్ లకు రాయితీలు ఇచ్చారని వివేక్ చెప్పారు.

## మందలించారని ఉరేసుకున్నారు

### బయటకు వెళ్లొద్దన్నందుకు ఒకరు… చదువుకోమని చెప్పడంతో మరొకరు..

#### పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు బలవన్మరణం




యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం)/ గోదావరిఖని: అర్ధరాత్రి బయటకు వెళ్తొద్దని తండ్రి మందలించడంతో ఒకరు, పర్యతి మార్కులు కోవాలని తల్లి హెచ్చరించడంతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. పెద్దపల్లి జిల్లాలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీ సమీప పోతనకాలనీలో ఉంటూ, ఏఎల్‌పీ గనిలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుడు కొండిల్ల శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు సాయి అవినాష్ (20) డిప్లొమా చదువుతూ వార్షిక పరీక్షల్లో ఫెయిలయ్యాడు.అతడి కోరిక మేరకు తండ్రి మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐలో చదివిస్తున్నాడు. ఈనెల 29న ఇంటికి వచ్చిన అవినాష్.. ఆదివారం రాత్రి బయటకు వెళ్తానని, బైక్ కావాలని తండ్రిని అడిగాడు, రాత్రి సమయంలో బయటకు వెళ్లొద్దని, బైక్ ఇవ్వనని తండ్రి చెప్పడంతో కలత చెందిన అవినాష్.. తెల్లవారు జామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో తల్లిమందలించిందన్న మనస్థాపంతో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన ముక్క రోహిత్(16) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

# మదర్ డెయిరీకి శరాఘాతం

### విజయ డెయిరీ నెయ్యి వాడకానికి ఆదేశం

### ప్రభుత్వ నిర్ణయంతో నష్టాల్లోకి వెళ్లనున్న మదర్

**యాదగిరిగుట్ట, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని ఇకపై విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 1 నుండి విజయ నెయ్యిని అన్ని ఆలయాలు వినియోగించనున్నాయి.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డైయిరీకి ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. మదర్ డైయిరీకి ప్రధాన ఆదాయ వనరుగా యాదగిరిగుట్ట దేవస్థానానికి నెయ్యి విక్రయానికి బ్రేక్ పడుతోంది. మదర్ డైయిరీకి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన మదర్ డైయిరీకి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారనుంది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతోంది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత స్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. సాధారణ రోజుల్లో స్వామివారిని 30 వేల మంది భక్తులు దర్శించు కుంటున్నారు. శని ఆదివారాల్లో 50వేల మంది భక్తుల స్వామి వారిని దర్శించు కుంటున్నారు. తిరుపతి లడ్డు తర్వాత రుచి శుచిలో యాదగిరిగుట్ట స్వామి లడ్డును భక్తులు అమితంగా ఇష్టపడతారు. స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడు మహా ప్రసాదంగా భావించే యాదాద్రి లడ్డును కొనుగోలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయంలో ప్రతిరోజు 22వేల లడ్డూలను తయారు చేస్తున్నారు. ఈ లడ్డు తయారీకి ప్రభుత్వ రంగ సంస్థ మదర్ డైయిరీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ లో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ అప్రమత్తమై రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో విజయ డైయిరీ నెయ్యిని కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి జనవరి 1నుంచి విజయ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మదర్ డైయిరీ ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, చెర్వుగట్టుతో పాటు రాష్ట్రంలోని కీసర, వేములకొండ తదితర ఆలయాలకు కొన్నేళ్లుగా మదర్ డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోంది. తద్వారా మదర్ డెయిరీకి ఏటా రూ.36 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇందులో ఒక్క యాదగిరిగుట్ట దేవస్థానం నెలకు 30 టన్నుల నెయ్యిని మదర్ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నారు. 35 ఏళ్లుగా మదర్ డైరీ నెయ్యిని వినియోగిస్తున్నామని, ఇందుకు గాను దేవస్థానం ఏటా రూ.18 కోట్ల వరకు చెల్లిస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటో తేదీ నుండి విజయ డైయిరీ నెయ్యిని వినియోగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న మదర్ డైయిరీ.. ప్రభుత్వ నిర్ణయంతో మరింత చతికిలపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ- రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న నార్ముల్ మదర్ డైయిరీలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రైతులే ఉన్నారు. జిల్లాలో 24 చిల్లింగ్ సెంటర్లు ఉండగా, 435 సొసైటీల ద్వారా సుమారు 45 వేల మంది రైతులు రోజూ సగటున లక్ష లీటర్ల పాలు పోస్తున్నారు. మదర్ డైయిరీకి వేల లీటర్ల పాలు పోసి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ గడిచిన 40 ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రైవేట్ డైయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చినా రైతులు మదర్ డైయిరీని కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంలో యాదగిరిగుట్ట, చెరువు గుట్ట దేవాలయాలను మినహాయించాలని రైతులు కోరుతున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి ప్రతి నెలా 30 టన్నుల నెయ్యి మదర్ డైయిరీ సరఫరా చేస్తుంది. ఇది డెయిరీకి అతిపెద్ద ఆదాయ వనరుగా ఉంది. లడ్డూ ప్రసాద తయారీలో వినియోగిస్తున్న మదర్ డైయిరీ నెయ్యి స్వచ్ఛమైనదేనని, ఎలాంటి కల్తీ లేదని స్టేట్ ఫుడ్ లేబొరేటరీ రిపోర్ట్ ఇచ్చింది. కాగా యాదగిరిగుట్టకు గత 40 ఏళ్లుగా మదర్ డెయిరీనే నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ కాంట్రాక్ట్ మార్చి 2025 వరకు ఉంది. ఈ నేపథ్యంలో గుట్టకు మదర్ డెయిరీ నెయ్యినే సరఫరా చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మదర్ డైయిరీలో యాదాద్రి జిల్లా రైతులే అత్యధికంగా ఉన్నారని, రైతుల ప్రయోజనం కాపాడేందుకు తాము ప్రయత్నిస్తామని నేతలు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం నుంచి యాదగిరిగుట్టను మినహాయించేలా ప్రయత్నిస్తామని నేతలు చెబుతున్నారు.



# దేశ ఆర్థిక వ్యవస్థకు దవ,దిశ చూపిన దార్శనికుడు

### మన్మోహన్‌కు నివాళి కార్యక్రమంలో హరీష్ రావు.. స్కిల్ వర్సిటీకి పివి పేరు పెట్టాలని డిమాండ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయనపై పీవీ నరసింహా రావు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయలేదని చెప్పారు. లైసెన్స్ రాజ్, పర్మిషన్ రాజ్, కోటా రాజ్ విధానాలకు మన్మోహన్ స్వస్తి పలికారని తెలిపారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సభ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగినట్లు వార్తలొచ్చాయి. కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ రాలేదని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ జీవితం దేశ సేవలో ధన్యమైందని చెప్పారు. ఆయన సేవలను గుర్తుంచుకునేలా ప్రభుత్వాలు ఏం చేసినా బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. పీవీ ఖ్యాతిని చాటేలా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని, స్కిల్ వర్సిటీకి నరసింహారావు పేరు పెట్టాలని ప్రతిపాదించారు. భారత రత్నకు మన్మోహన్ సింగ్ 100 శాతం అర్హులేనని చెప్పారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ కోరుతున్నదని తెలిపారు. గతంలో పీవీకి భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ తీర్మానించిందని, దానికి అనుగుణంగా కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చిందని గుర్తుచేశారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు పీవీ-మన్మోహన్ ద్వయం కృషి చేసిందని వెల్లడించారు. 1996లో కాంగ్రెస్ ఓటమికి ఆర్థిక సంస్కరణలూ కారణమని ఓ కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిని చూసిన మన్మోహన్ సింగ్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు. మన్మోహన్ భౌతికంగా లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఉంటాయన్నారు. విదేశాల్లోనూ ఆయనకు ఉన్నత ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వాటికంటే దేశమే ముఖ్యమని చాటిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని చెప్పారు. ఆయన ఎప్పుడూ పదవుల కోసం చూడలేదని, పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానాన్ని మండలిలోనూ పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు.



## గురుకులాలంటే ఎందుకింత నిర్లక్ష్యం.?? : కేటీఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వానికి గురుకులాలంటే ఎందుకింత నిర్లక్ష్యమో అర్థం కావడం లేదని, బీఆర్ఎస్ పాలనలో గురుకులాలు ఒక వెలుగు వెలిగితే ఇప్పుడు అంధకారంలో మగ్గుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. పదేండ్లలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాల గౌరవం.. ఏడాదిలో ఎందుకు పడిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గురుకులాలను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారా అని మండిపడ్డారు. ఇది కక్ష, శిక్షా లేక నిర్లక్ష్యమా అని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. మండలానికి ఒక్క గురుకుల పాఠశాలకు మాత్రమే పరిమితం చేసే కుట్ర దాగి ఉందా అని సందేహం వ్యక్తం చేశారు. అందుకే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల్లో, విద్యార్థుల తల్లిదండ్రులలో అభద్రతా భావం పెంచుతున్నారా అన్నారు. ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు మరణించినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. ప్రతిష్ఠాత్మకంగా సీఎం నుంచి మంత్రుల వరకు కామన్ డైట్ అంటూ ఆర్భాటంగా ప్రారంభించింది ఆరంభ శూరత్వమేనా అంటూ విమర్శించారు. కేసీఆర్ పాలనలో దేశానికి ఆదర్శం, నేడు అంతులేని నిర్లక్ష్యమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రైతుబంధు ఇవ్వాలన్న కనీస సోయి కాంగ్రెస్‌కు లేదు


### రైతు కూలీలకు సాయం చేస్తానని మాట మార్చిండ్రు

### రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

### ప్రతీ ఐదు గంటలకొక మహిళ కిడ్నాప్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రజలను కన్నబిడ్డలను చూసుకున్నట్లుగా చూసుకున్నారని తెలిపారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని.. రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. రైతు కూలీలకు కూడా సాయం చేస్తామన్న ప్రభుత్వం.. ఇప్పటికీ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని.. రాష్ట్రంలో ప్రతీ మూడు గంటలకు మహిళలపై ఒక అత్యాచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఐదు గంటలకు ఒక మహిళా కిడ్నాప్ అవుతోందని.. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు పోలీసులు కాంగ్రెస్ నేతలు చుట్టూ తిరగడం తప్పా.. ఏం చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పోలీసులు పీపుల్స్ ఫ్రెండ్లీగా ఉండేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేకపోవడం దారుణమని.. సీఎం రేవంత్ రెడ్డి మహిళా భద్రతపై ప్రత్యేకంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఎప్పుడూ లేనట్లు రెండు పెద్ద ఎన్ కౌంటర్లు జరిగాయని.. తుపాకీ మోతలు ఉండవద్దన్న లక్ష్యంతో పరిపాలన చేసిన వ్యక్తి కేసీఆర్ అని.. ఇవాళ రేవంత్ రెడ్డి శాంతి భద్రతలకు భగ్నం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు మాత్రం విడుదల చేసిందని.. రైతులను నరకయాతన పెట్టడానికి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం రీసర్వే చేసే ముందు భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూముల రీసర్వే పేరిట ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద రాయన్న నమ్మకం ప్రజలకు, రైతులకు లేదని.. కాంగ్రెస్ పై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని.. నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని.. జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరని.. ఎంపీ ఉన్నా లేనట్లే.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారన్నారు. నిజామాబాద్‌కు ఆరు నెలల నుంచి పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. ఏడాదికాలంలో ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదని.. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక కొత్త పని చేపట్టలేదన్నారు. ఎస్సారెస్పీ నుంచి నిజామాబాద్ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న పిచ్చి ప్రయత్నంతో ఎస్సారెస్పీని ఎండబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎడిటోరియల్



# వ్యవసాయాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేయాలి

### పంటల విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టాలి
### సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా నిర్ణయాలు

**రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి.**


మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమం గానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. వ్యవసాయరంగంలో విప్లవాత్మకనిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి. సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. స్వాతంత్ర్యం లభించి 76సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమీ సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మనరైతులనే ప్రోత్సహించి పంటల దిగుబడి పెంచుకోవాలి. పెరిగిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేలా విధానాలు రూపొందించాలి. రైతులను కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకే సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతు న్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభి స్తూనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటు న్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి.

# పటిష్ఠ ప్రణాళికలతో ముందుకు సాగాలి !

**తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి.**

రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్దికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్ధతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ధి చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక

ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్ధిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.






(ఆధ్యాత్మిక చింతన)

## చిన్న తిరుపతిలో అశ్వయుజ బ్రహ్మోత్సవాలు

ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 5వ రోజు గురువారం చిన వెంకన్న మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు జరగనుంది. అలాగే రాత్రి 8 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం జరగనుంది. అనంతరం వెండి గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది. కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. 18న (శుక్రవారం) ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ ఎనిమిది రోజులపాటు ద్వారకా తిరుమలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి.. చిన వెంకన్నను దర్శించు కుంటారు. కాగా బ్రహ్మోత్సవాల సందర్భంగా.. నిత్యార్జిత కళ్యాణాలు, సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన ఆలయంతో పాటు.. నాలుగు రాజగోపురాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం శ్రీహరి కళాతోరణంలో భక్తుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భద్రత పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్నిరకాల చర్యలు చేపట్టారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.18వ తేదీ రాత్రి ఏడు గంటలకు స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. శనివారం (19వ తేదీ) ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.

**ద**సరా పండుగకు చేనేత సొసైటీల్లో వస్త్ర విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలింది. పండుగకు ఇచ్చే రిబేటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది.



# నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

### నాలుగు నెలలైనా అమలుకు నోచని హామీ

200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. మరోపక్క రిబేటు, యార్న్ సబ్సిడీ పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. పండుగల రోజుల్లో సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై 30 శాతం రిబేటు ప్రకటించాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వస్త్ర విక్రయాలకు ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహాలను, సొసైటీలకు విడుదల చేయాల్సిన రాయితీ బకాయిలను నిలిపివేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జూలై 13న రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత కృష్ణాజిల్లా పెడన, గూడూరు మండలాల్లో పర్యటించి ప్రసిద్ధి చెందిన చేనేత సొసైటీలను పరిశీలించారు. నేతన్నలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రకటించారు. దీంతో గత టిడిపి హయాంలోలాగా సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై పండుగలకు ప్రభుత్వం 30 శాతం రిబేటు ప్రకటిస్తుందని, తద్వారా ఈ ఏడాది వస్త్ర వ్యాపారం పెరుగుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కృష్ణాజిల్లాలోని 37 సొసైటీల్లో ప్రతి ఏటా సగటున రూ.11.99 కోట్ల విలువైన 7,02,633 మీటర్ల చేనేత వస్త్రాల ఉత్పత్తి జరుగుతోంది. వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలకు గతంలో 30 శాతం రిబేటు ప్రకటించారు. ఆయా సందర్భాల్లో సొసైటీల్లో 35 శాతం వరకు చేనేత వస్త్ర విక్రయాలు పెరిగాయి. తాజాగా రిబేటుపై ప్రకటన చేయకపోవడంతో దసరా పండుగకు సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 2016-17 నుంచి 2018-19 వరకు మూడేళ్లలో పండుగలకు ప్రకటించిన 30 శాతం రిబేటు రూ. 6.11 కోట్లు, యార్న్ సబ్సిడీ మరో రూ. 6.96 కోట్లు మేర సొసైటీలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయలేదు.

# ఆగని సమ్మె..సాగని చదువులు..!

## 25 రోజులుగా సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు..!
## ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్..!
## మూతపడిన ఎమ్మార్సీ భవనాలు..!
## అధ్వానంగా కేజీబీవీల పనితీరు..!
## విద్యార్థుల చదువుపై సమ్మె ప్రభావం...!
## ఆందోళనను పట్టించుకోని ప్రభుత్వం..!






"సమగ్ర శిక్ష ఉద్యోగులు తగ్గేదేలే అంటున్నారు.తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని 25 రోజులుగా ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఆందోళన చేపడుతున్న ఉద్యోగులు..ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరు కొనసాగుతుందని తేల్చి చెబుతున్నారు.రోజుకో తీరుగా నిరసన తెలుపుతూ వినూత్నంగా ముందుకు సాగుతున్నారు.ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు"

**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని సమ్మెబాట పట్టడంతో కేజీబీవీలు, ఎమ్మార్సీ భవనాలు వెలవెలబోతున్నాయి. జిల్లాలో కస్తూర్బా పాఠశాల, ఎమ్మార్సీలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో 21 రోజులుగా రోజుకో విధంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు.ఇన్నిరోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఫలితంలేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు.డిమండ్లు నెరవేరే వరకు పోరు కొనసాగిస్తామని ఉద్యోగులు తేల్చిచెబుతున్నారు.దారిద్ర్యరేఖకు దిగువన ఉండి విద్యాపరంగా వెనకబడిన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు గురుకుల విధానంలో చదువుతో పాటు భోజనం అందించడానికి 2014లో అప్పటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా కేజీబీవీలు ఏర్పాటు చేసింది.విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా,ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు.మిగిలిన విభాగాల్లో అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల స్థాయిలో విధులు నిర్వర్తించే సీఆర్పీలు ఎంఐఎసలు, కో ఆర్డినేటర్లు, డేటా ఆపరేటర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్పీలు జిల్లా స్థాయిలో పీపీవోలు, సిస్టమ్ ఎనలిస్టులు టెక్నికల్ పర్సన్‌లు డీఎల్ఎంటీ మెసెంజర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

**కేజీబీవీలు, ఎమ్మార్సీల్లో ఇబ్బందులు..!**

జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 750మంది ఉద్యోగులు ఉన్నారు.ఇందులో 19 కేజీబీవీల్లో 481మంది ఉద్యోగులు, డీపీవోలు 7మంది, సీసీవోలు 15మంది,సీఆర్పీలు 59మంది, మెస్సెంజర్లు 16 మంది. ఐఈఆర్పీలు 26మంది,మోడల్ స్కూల్ 18,యుఆర్ఎస్ లు 12 మంది.పీటీఐలు 98మంది పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెలో ఉండటంతో కస్తూర్బా పాఠశాలల పనితీరు దారుణంగా తయారైంది.రాత్రి వేళ బాలికల భద్రత వంటవారికి తలకు మించిన భారంగా మారింది. ప్రధానంగా ఎంఈలకు ఇబ్బందులు అధికమయ్యాయి. ప్రతీరోజు బడుల్లో మధ్యాహ్న భోజనం తీరు, ఉపాధ్యాయుల హాజరు తదితర వివరాలను పరిశీలన, పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రాల్లో వసతులు ఏర్పాటు తదితర పనులు భారంగా మారాయి. సమ్మె కారణంగా ఎమ్మార్సీ భవనాలు మూతపడ్డాయి. దాంతో ఎంఈవోలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బోధన సిబ్బంది రాకపోవడంతో తరగతులు కొనసాగక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మార్సీలో విధులు నిర్వర్తిస్తున్న వారికి నెలకు రూ.19వేల వేతనమందిస్తున్నారు. 2009 నుంచి కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లకు నెలకు రూ.26వేలు, ప్రత్యేకాధికారులకు నెలకు రూ.32,500 వేతనాలిస్తున్నారు. ఈ వేతనాలు మరింత పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై చాలాకాలంగా కలెక్టర్,డీఈవోలకు వినతిపత్రాలందించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

**నిలిచిన కార్యకలాపాలు...!**

మండల వనరుల కార్యాలయంలో విధులు నిర్వర్తించే సీఆర్పీలు,సాంకేతిక నిపుణులు, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో లేక మండలాల నుంచి కలెక్టర్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతా?ధికారులకు పంపించే మధ్యాహ్న భోజనం తదితర నివేదికలు నిలిచిపోయాయి.సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కొనసాగే బియ్యం పంపిణీ, బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు తదితర కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి.

**ప్రభుత్వం వెంటనే డిమాండ్లు నెరవేర్చాలి..!**



కొన్నేండ్లుగా సమగ్ర శిక్షా ఉద్యోగులుగా పనిచేస్తున్నాం.మా సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలి. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ ఇవ్వాలి.22 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.

శ్రీలత ఎస్ఓ కేజీబీవీ నవాబ్ పేట్...!



## అసంపూర్తిగా ఉన్న సింగాపూర్ రోడ్డు పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కు బిజెపి నాయకుల వినతి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 1,9,10 సింగపురం వార్డుల పరిధిలో రెండు వరుసల ప్రధాన రహదారి రోడ్డు వాగు వరకు వేశారు. అసంపూర్తిగా ఉన్న మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సింగాపురం బిజెపి కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వర్షం పడిన సమయంలో బురదలో నుండి ప్రయాణించాల్సిన అవసరం ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు, పాదాచారులు రోడ్డుపై గుంతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ కొంత భాగం రోడ్డు సమస్యను తీర్చాలని కమిషనర్ ను కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్లమెంటులో అంబేద్కర్ ని అవమానపర్చిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి

### భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అవమాన పర్చినందుకు అమిత్ షా దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

### సిపిఎం నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి




పార్లమెంట్లో అంబేద్కర్ ని అవమానించిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకోబడిన ఒక వ్యక్తి ఆ పరిధి దాటి రాజ్యాంగంపై ప్రమాణం చేసి హోం మినిస్టర్ గా కొనసాగుతున్న అమీషా రాజ్యాంగంపై అంబేద్కర్ పై చెక్కిన అనుచిత వ్యాఖ్యలను సిపిఎం నాంపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం సిఐటియు వామపక్ష నాయకులు నిరసన తెలియజేశారు. వామపక్షాల దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఏర్పాటు చేసిన సందర్భంగా సిపిఎం నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్ వాదులు దళితులపై,మైనారిటీలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి పై ఆర్ఎస్ఎస్ కొంతమంది అయ్యప్ప స్వాములు దాడి చేసి అవమానించి కాళ్ళు మొక్కించుకోవడం దుర్మార్గమైన చర్య అని, విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన గురువులను అవమానించడం సోషనీయమని, గురువు చేతిలో బేత్తం దెబ్బలు తినకుండా విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడిందని, దళిత హెడ్మాస్టర్ ను అవమానించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ పార్లమెంటులో అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లౌకిక భారతదేశంలో అన్ని మతాల అభిప్రాయాలను గౌరవించాల్సిన ప్రభుత్వాలు మతతత్వ విధానాలను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సి ఐ టి యు వామపక్ష నాయకులు వేని జాల వెంకటయ్య, మాణిక్య రెడ్డి, ఎల్లయ్య మరియమ్మ, రాములమ్మ సులోచన ఈరమ్మ రవితేజ కృష్ణయ్య, మల్లయ్య, ఎల్లమ్మ, కృష్ణయ్య, బిక్షం, తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత వాహనాల బహిరంగ వేలం




**పెద్దపల్లి క్రైమ్ మిర్రర్ డిసెంబర్ 31 :** రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీ ఎం శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ఆదేశాల మేరకు పోలీస్ వాహనాల పాత స్పేర్ పార్ట్స్, టైర్స్, బ్యాటరీస్, ఉపయోగించిన ఇంజన్ ఆయిల్ ను జనవరి 03-2025 రోజున రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమాచారం కోసం ఆర్ఐ ఎం టి ఓ సంపత్ ను 8712656616 సంప్రదించాలని సూచించారు.

# టైటిల్ లిమంథని పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీపీ

### పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలి.

### ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలి: పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్.,



వార్షిక తనిఖీల్లో భాగంగా మంథని పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ఈరోజు తనిఖీ చేసారు. తనిఖీ లో భాగంగా మంథని పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం ముందుగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ లోపల రైటర్ రూమ్, లాక్ అప్ రూమ్ పరిశీలించారు.అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును, రికార్డ్స్ పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని, ఆన్లైన్ చేస్తున్నారా అని పోలీస్ కమిషనర్ గారు సిబ్బంది, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, గ్రేవ్ కేసెస్ లలో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించారు. నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు సమస్యాత్మక గ్రామాల వివరాలు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్స్ వివరాలు పోలీస్ కమిషనర్ సబ్ ఇన్స్ స్పెక్టరు ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. పోలీస్ స్టేషన్ లో పని చేస్తూన్న సిబ్బంది తో మాట్లాడి ఎవరికైనా ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడం జరిగింది ఏదైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టి కి తీసుకురావాలి అని వ్యక్తిగత, ఇతర సమస్యలతో ఒత్తిడికి లోనై అవాంచనియా ఘటనలకు పాల్పడం చేస్తున్నారు అన్నారు. అధికారుల, సిబ్బంది యొక్క బాగోగులు, సంక్షేమం ఉన్నత అధికారులుగా బాధ్యత అని కావున ఏదైనా సమస్య ఉంటే అధికారులకు తెలపాలిని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని భరోసా వారిలో కలిగించాలన్నారు . నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని చట్టాలను అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి విషయం ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, ముందస్తూ సమాచార సేకరణ అవరమని, బ్లూ క్లోట్స్ సిబ్బంది డయాల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించి వారు సంఘటన స్థలంకి త్వరగా చేరుకోవాలని సూచించారు. బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది విసబుల్ పోలిసింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, పిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని, గంజాయి,మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖిల్లో పెద్దపల్లి డీసీపీ చేతన ఐపిఎస్.,గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, మంథని సీఐ బి. రాజు మంథని ఎస్ఐ రమేష్, ఉన్నారు.

# పసి బాలుడు మాయం..!

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు...!

### వికారాబాద్ జిల్లా తాండూర్ లో ఘటన...!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** అమ్మ కొంగుకు కట్టుకున్న ఏడాది బాలున్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతాపూర్ గ్రామంలో సోమవారం కలకలం రేపింది.స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ఆ%రాత్రి నిద్రించే సమయంలో పసిబాలుడు బయటికి వెళతాడనే భయంతో బాలుడి తల్లి తన చీర కొంగుకు కట్టుకుని నిద్రించిందని చెప్పారు. పక్కలో ఉన్న ఏడాది బాలున్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయారంటూ సోమవారం కరన్ కోట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై విఠల్ రెడ్డి వెల్లడించారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పసి బాలుడు మిస్సయిన ఘటనపై అక్కడి స్థానికుల తో పాటు బతుకుదెరువు కోసం వచ్చిన ఆ కుటుంబ సభ్యులను ఆరా తీశారు.కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్ ప్రాంతానికి చెందిన భాష అనే వ్యక్తి భార్య గోరీబీ, తన ముగ్గురు పిల్లలతో కలిసి గౌతాపూర్ గ్రామానికి బతుకు తెరువు కోసం వచ్చారని గత కొన్ని రోజులుగా గ్రామంలో గ్యాస్ స్టవ్ రిపేర్లు, చిన్న చిన్న మరమ్మత్తుల పనులు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు.ఆదివారం రాత్రి గ్రామంలోని మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రాంగణం వద్ద కుటుంబంతో కలిసి నిద్రించిన్నట్లు గుర్తించామన్నారు. తన కుమారుడిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారంటూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న ఎస్ఐ మిస్సింగ్ అయిన బాలుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు

# కోదాడ తారా టీ స్టాల్ చాయ్ అమోఘం..!

**8 సంవత్సరాలుగా నడిపిస్తున్న వైనం**

**కోదాడలో పేరుగాంచిన టీ స్టాల్ గా గుర్తింపు**

**దాంతోపాటు 10 బ్రాంచ్ రన్**

**యువకులకు ఉపాధి కల్పిస్తూ చేయూత**

**తారా టీ స్టాల్ యజమానికి ముఖ్య నాయకుల ప్రశంసలు**




**కోదాడ డిసెంబర్ 30 క్రైమ్ మిర్రర్ :** గత 8 సంవత్సరాలుగా కోదాడ బ్రాంచ్ తో పాటు,నెలకొండపల్లి, ఖమ్మం, మహబూబాద్, నర్సంపేటలో-2, కూసుమంచి, అస్సాం లో తార టీ స్టాల్ నడుపుతూ పేరు తెచ్చుకున్న తారా టీ స్టాల్ యాజమానికి ప్రముఖ ముఖ్య నాయకులు ప్రశంసలు తెలియజేశారు. అలాగే యువకులకు ఉపాధి కల్పిస్తూ చేయూతగా ఉంటున్నారని కొనియాడారు. తారా టీ స్టాల్ లో లభించే చాయ్ అమోఘంగా ఉంటుందని, కోదాడ, జగ్గయ్యపేట, మేళ్లచెరువు ప్రాంతాల నుండి అమృతమైన చాయ్ దొరుకుతుందని తాగడానికి వస్తారు..

**తారా చాయ్ మైమరిపించే కమ్మటి చాయ్..**

తారా టీ స్టాల్ కు రోజుకు వందల సంఖ్యలో చాయ్ తాగడానికి దూర ప్రాంతాల నుండి కోదాడ కు వస్తుంటారు.. తారా చాయ్ మైమరిపించే విధంగా ఉంటుందని, కోదాడ ప్రజానీకం చెబుతున్న మాటలు.. తార టీ స్టాల్ లో దొరికే చాయ్ మనిషి ఆరోగ్యంగా,హెల్తీగా ఉండే విధంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. తారా టీ స్టాల్ యాజమాన్యానికి 10 బ్రాంచ్ లు,ఉండగా ప్రతిచోట వందల సంఖ్యలో చాయ్ ప్రియులు ఆస్వాదిస్తున్నారని తెలుస్తుంది. సాధారణంగా ప్రతిచోట టీ స్టాల్ లో టీలు లభిస్తూ ఉంటాయి. కానీ ఇటీవల కాలంలో అందరికీ ఆరోగ్యం పై స్పృహ పెరిగింది. తినే ప్రతి దాని గురించి తెలుసుకొని మరీ తింటున్నారు. తారా టీ స్టాల్ చేస్తున్నటువంటి ఛాయలో ఆరోగ్యపరంగా ప్రయోజనాలు ఉండడంతో ఛాయ ప్రియులు క్యూ కడుతున్నారు...

**ప్రశంసల వెల్లువ..**

కోదాడ తోపాటు పది బ్రాంచ్లో రన్ చేస్తున్న తార టీ స్టాల్ కు ప్రముఖ నాయకులు ప్రశంశాల వెల్లువెత్తుతారు. యువకులకు ఉపాధితో పాటు చాయ్ ప్రియులకు కమ్మటి చాయని అందిస్తున్నారని రాష్ట్ర నాయకులు అన్నపు అప్పిరెడ్డి కోదాడలో ఉన్న తారా టీ స్టాల్ బ్రాంచ్ ను సందర్శించి అభినందించారు.

# కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా ఏపూరి తిరపమ్మ సుధీర్..



**కోదాడ డిసెంబర్ 30 క్రైమ్ మిర్రర్ :** కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కి జీవో నెంబర్ 902 ద్వారా నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వము సోమవారం జీవో జారీ చేసింది.ఈ మేరకు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా నడిగూడెం మండల కేంద్రవాసి అయిన ఏపూరి తిరుపమ్మ సుధీర్,వైస్ చైర్మన్ గా షేక్ బషీర్ తో పాటు 16 మంది డైరెక్టర్లతో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నుండి ఆదేశాలు వెలిబడ్డాయి.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఏపూరి తిరుపమ్మ సుదీర్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా అవకాశం కల్పించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి,పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా,వ్యవసాయ కుటుంబంలోని వ్యక్తిగా శక్తివంచన లేకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ఈ ప్రాంత రైతాంగానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దాం..

**డిసెంబర్ 31ను ఓ సాధారణ రోజు గానే చూడాలి..**

**చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎస్ వెంకటేశం ..**



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** డిసెంబర్ 31 ను ప్రతి ఒక్కరు ఓ సాధారణ రోజు గానే భావించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశం అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు సూచనలు సలహాలు చేశారు. ప్రజలు అర్ధరాత్రి దాటిన తర్వాత అతివేగంతో ప్రయాణాలు చేయరాదని, సురక్షితమైన ప్రయాణం కోసం హెల్మెట్ ధరించాలన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతాయని, ప్రజలు మద్యం సేవించి వాహనాలు చేయరాదన్నారు. తనిఖీలు పట్టుబడిన వారికి జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండు విధించే అవకాశం ఉందని, శంకర్పల్లి మోకిలా చేవెళ్ల షాబాద్ తదితర ఏరియాలలో నిరంతర ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ సురక్షితంగా ప్రయాణించి తమ గమ్యస్థానాలను చేరుకోవాల్సిందిగా సూచించారు కార్యక్రమంలో ఈసిల్ ఐ అశోక్, ఆర్ఎస్ఐ చందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# చార్టెడ్ అకౌంట్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి ఘనంగా సన్మానం

**మందమర్రి టౌన్ డిసెంబర్ 30 క్రైమ్ మిర్రర్:** మందమర్రి నార్లాపూర్ కు చెందిన బుడిగే శివకుమార్ సిఏ లో ఘనవిజయం సాధించిన సందర్భంగా మంచిర్యాల జిల్లా కురుమ సంఘం అధ్యక్షురాలు బండి రమశంకర్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో సోమవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన రాజేశ్వరి సమ్మయ్య కుమారుడు చిన్ననాటి నుంచి చదువుపై దృష్టి సాధించి ఎంతో కష్టపడ్డాడని ఇలాగే శ్రమిస్తూ ఇంకా ఉన్నత స్థితికి వెళ్లాలని అన్నారు.శివకుమార్ ని ఆదర్శంగా తీసుకొని ఊర్లో చదువుకుంటున్న విద్యార్థులు కూడా మంచి ఉత్తీర్ణతలతో మంచి ఉద్యోగాలు సాధించి ఊరుకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేగొండ శంకరయ్య,ఏనుగుల బీరయ్య,పోషన్న, సుధాకర్,సత్యనారాయణ, సాగర్,మల్లన్న,ఒగ్గు మల్లయ్య,గోపాల్,తిరుపతి, రమేష్,సురేష్ గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేట జిల్లా పోలీస్ పనితీరు అమోఘం

**ఎస్పీ సన్ ప్రీత్ సింగ్లి.. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి పోలీసులు పారదర్శకంగా పనిచేయాలి.. ప్రజలకు అందుబాటులో ఉండాలి సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**



**కోదాడ డిసెంబర్ 30 క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ శాంతి భద్రతల పరిరక్షణలో సూర్యాపేట జిల్లా పోలీస్ పనితీరు అమోఘం.. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి పోలీసులు పారదర్శకంగా పనిచేయాలి.. ప్రజలకు అందుబాటులో ఉండాలి సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రజల భాగస్వామ్యతోనే నేరాలను అరికట్టవచ్చని, పోలీసులు పారదర్శకంగా పనిచేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ చెప్పారు.సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి జిల్లా పోలీసు వార్షిక నివేదికను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పోలీసు స్నేహపూర్వక పోలీస్ విధానం అవలంబిస్తూ బాధ్యతాయుతంగా పారదర్శకంగా పనిచేస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణలో బాగా కృషి చేస్తున్నాం అని చెప్పారు. ఈ సంవత్సరం బాగా పని చేశామని, పోలీసు నిధుల నిర్వహణలో నేరాల నివారణలో ప్రజలు పౌరుల భాగస్వామ్యమై పోలీసులకు సహకరించారు అని ఎస్పీ తెలిపారు.సూర్యాపేట జిల్లాలో 2023 సంవత్సరంతో పోలిస్తే 2024 సంవత్సరం నందు నేరాలు సమానంగా నమోదైనప్పటికీ కొంతమేర తగ్గుదల ఉన్నదని తెలిపారు. ఈ సంవత్సరం డయల్ 100 కు ఫోన్ కాల్ ద్వారా 34950 ఫిర్యాదులు రాగా సగటున 6 నిమిషాల్లో బాధితులకు పోలీసు సేవలు అందించాం అన్నారు. 2023 నందు 7244 కేసులు నమోదు కాగా 2024 సం.లో 7178 కేసు నమోదైనాయి అన్నారు. వీటిలో భౌతిక దాడులు 796 కేసులు, రోడ్డు ప్రమాదాలు 609 కేసులు, మహిళా సంబంధిత నేరాలు 557 కేసులు, మద్యం అక్రమ రవాణా అక్రమ అమ్మకాలు 434 కేసులు, దొంగతనాలు 536 కేసులు, వంచన మోసాలు 325 కేసులు, సైబర్ నేరాలు 205 కేసులు గా నమోదైనాయి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలను జూలై నెల నుండి జిల్లాలో అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు కొత్త చట్టాల క్రింద 3513 కేసులు నమోదు చేశామని మొదటి కేసును గరిడేపల్లి పోలీస్ స్టేషన్ నందు నమోదు చేయడం జరిగిందని అన్నారు. సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, ఈ సంవత్సరం 1212 ఫిర్యాదు లాగా 2005 కేసులు నమోదు చేశామని, సైబర్ మోసాల ద్వారా మోసానికి గురైన 7.83 కోట్ల రూపాయల నుండి సుమారు 40 లక్షల వరకు బాధితులకు రిఫండ్ చేశామని, 1.16 కోట్ల రూపాయలను బ్యాంక్ లలో హోల్డ్ చేయించాం అన్నారు.ఎన్ఫోర్స్మెంట్ వర్క్ బాగా పెంచడం జరిగిందని, 38 గంజాయి కేసుల్లో 318 కేజీల గంజాయిని సీజ్ చేసి 135 మందిని జైలుకు పంపించామన్నారు. గత సం.తో పోలిస్తే గంజాయి కేసుల్లో ఎక్కువ మందిని అరెస్టు చేశాం అన్నారు. ప్రజా పంపిణీకి చెందిన బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఈ సంవత్సరం 178 కేసులు నమోదు చేసి 3200 క్వింటాల బియ్యం సీజ్ చేశామని వెల్లడించారు. బియ్యం అక్రమ రవాణకు సంభందించి 2023 సంవత్సరం తో పోలిస్తే 2024 సం.లో 160శాతం ఎక్కువగా పిడిఎస్ రైస్ కేసులు నమోదు చేసి 193% ఎక్కువగా బియ్యం సీజ్ చేశాం అన్నారు. 289 మందిని రిమాండ్ కు తరలించామని, ఇద్దరిపై పిడి యాక్ట్ నమోదు చేశాం అన్నారు.ఇసుక అక్రమ రవాణాలో 522 కేసులు బుక్ చేసి 650 మందిని అరెస్ట్ చేశామన్నారు. గేమింగ్ యాక్ట్ సంబంధించి 54 కేసులు నమోదు చేసి 313 మందిని అరెస్ట్ చేశామన్నారు. ప్రతిరోజు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తూ 236289 ఈ చలాన్ కేసులు నమోదు చేసి 7.53 కోట్ల రూపాయలు జరిమానా విధించడం జరిగినదన్నారు. అలాగే వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోయినా, డామేజ్ అయిన దానికి సంబంధించి 11321 కేసులు నమోదు చేసి 26 లక్షల 64 వేల రూపాయలు జరిమానా వేయించడం జరిగింది అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12,940 మందిపై కేసులను నమోదు చేసి 66 లక్షల 97 వేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందని వివరించారు.జిల్లాలో గత సంవత్సరం 122 తీవ్రమైన నేరాలు నమోదు కాగా ఈ సంవత్సరం 36శాతం పెరిగి 167 కేసులు నమోదయ్యాయి అని, ఈ 166 కేసుల్లో కేసుల్లో 151 కేసులు 90 శాతం చేదించి నేరాలకు పాల్పడిన వారిని రిమాండ్ కు తరలించామని తెలిపారు. దొంగతనాలకు సంబంధించి ఈ సంవత్సరం 536 కేసులు నమోదయాయని వీటిలో 63% కేసులు 338 కేసు సేదించి 45శాతం 2 కోట్ల 20 లక్షలు సొమ్ము రికవరీ చేశామన్నారు. వివిధ రూపాల్లో పోగొట్టుకున్నటువంటి మొబైల్స్ సంబంధించి 1780 ఫిర్యాదులు రాగా అందులో 1140 (65 శాతం) మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందని తెలిపారు. నేరాల్లో శిక్షల అమలుకు సంబంధించి ఈ సంవత్సరం 1082 కేసులు వాదనకు రాగా 32 కేసుల్లో 24 మందికి జైలు శిక్షలు అమలు అయ్యాయని, వీటిలో ఆరుగురికి జీవిత ఖైదు, ఇద్దరికీ 15 సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికీ 10 సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికీ ఐదు సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికీ మూడు సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికీ ఒక సంవత్సరం పైబడి శిక్ష, మరో ఎనిమిది మందికి సంవత్సరంలోపు శిక్షలు అమలు అయ్యాయని తెలిపారు. కోర్టు మానిటరింగ్ లో సమన్వయంగా బాగా పనిచేస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్ లో 38298 పెట్టీ కేసులను పరిష్కరించామని చెప్పారు.రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గత సంవత్సరం 573 కేసుల్లో 257 మంది మరణించగా ఈ సంవత్సరం 609 కేసుల్లో 262 మంది మృత్యువాత పడ్డారని, ఈ మృత్యువాత పడ్డ వారిలో 320 కేసుల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై 151 మందిమృత్యువాత పడ్డారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, వీటి నివారణకు ప్రణాళిక పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వివరించారు.మహిళా భద్రతకు సంబంధించి జిల్లాలో స్థానిక పోలీసులతో కలిసి షీ టీమ్స్, భరోసా సెంటర్స్ పనిచేస్తున్నాయని అన్నారు. ఈ సంవత్సరం షీ టీమ్స్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 165 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, 2023 నందు షీ టీమ్స్ కి 141 ఫిర్యాదులు రాగా ఈ సంవత్సరం ఫిర్యాదులు తగ్గి 75 ఫిర్యాదులు వచ్చాయని, 135 ఫ్యామిలీ కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. షీ టీం సిబ్బంది ప్రజల్లో తిరుగుతూ 98 పెట్టి కేసులను నమోదు చేశారని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా 132 మందికి కౌన్సిలింగ్ ఇచ్చి 81 కేసుల్లో వైద్య సదుపాయము అందించారు అన్నారు.ఆపరేషన్ ముస్కాన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలు, లేబర్ అడ్డాలు, హోటల్స్, లాడ్జిలనుంది షాప్స్ నందు పనిచేస్తున్న 236 మంది బాలురులను, 43 మంది బాలికలను సంరక్షించడం జరిగిందని వెల్లడించారు. మహిళా కేసులకు సంబంధించి గత సంవత్సరం 5503 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 557 కేసులు నమోదయ్యాయని, వేధింపుల కేసులు, అత్యాచారం కేసులు పెరిగినాయని చెప్పారు. పోలీసు ప్రత్యేక చర్యల వల్ల ఈ సంవత్సరం ఈవ్ టీజింగ్ కేసులు 18 శాతం తగ్గాయన్నారు. సమాజంలో గొడవలకు, నేరాలకు పాల్పడతారని ముందస్తుగా 344 కేసుల్లో 1888 మంది అనుమానితులను బైండోవర్ చేశామని తెలిపారు.సామాజిక అంశాలపై ప్రజలను చైతన్య పరుస్తూ గత సంవత్సరం పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో 240 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 2024 సంవత్సరం నందు 360 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పి మేక నాగేశ్వరరావు, ఏఆర్ అదనపల్లి జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి రవి, నరసింహ, సిఐలు వీర రాఘవులు, రాజశేఖర్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఆధునిక ఆరోగ్యం కోసం తెలివైన ఎంపిక మిల్లెట్స్

**గెస్ట్ లెక్చర్ - డా. ఖాదర్ వలి**



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** నేటి ఆధునిక ప్రపంచంలో మెరుగైన ఆరోగ్యం కోసం మిల్లెట్స్ తెలివైన ఎంపిక అని డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు శంకర్ పల్లి మండల పరిధిలోని ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (%×ఖీఎజు%)లోని సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్ (%జఔణ%) మరియు క్లబ్ ఆధ్వర్యంలో ఐబీఎం ఆడిటోరియంలో "మిల్లెట్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లెట్స్‌ను రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల కలిగే అనేక ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. పోషకాలు అధికంగా ఉన్న ఈ పురాతన ధాన్యాలు డయాబెటిస్, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వంటి ఆధునిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఎంతగానో సహాయపడతాయని తెలియజేశారు. అదేవిధంగా, సంప్రదాయ ధాన్యాల కంటే తక్కువ వనరులు అవసరం చేసే మిల్లెట్స్ సాగు పర్యావరణానికి ఎంత సుస్థిరమో వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రఖ్యాత ఫిజియోథెరపిస్ట్ మరియు యోగా థెరపిస్ట్ డా. పి. విజయ కుమార్ గారు సమన్వయం చేశారు, వీరి నైపుణ్యం మిల్లెట్స్‌తో కలిగే సమగ్ర ఆరోగ్య ప్రయోజనాలపై విలువైన అభిప్రాయాలను అందించింది. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ డా. ఎల్. ఎస్. గణేష్, రిజిస్ట్రార్ డా. ఎస్. విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చక్కగా చదువుకునేంటేనే బంగారు భవిష్యత్తు-మండల విద్యాధికారి శంకర్ రాథోడ్




**గండిపేట్(క్రైం మిర్రర్):** విద్యార్థులు చక్కగా చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండల స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్ పోటీలు సోమవారం మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పరీక్షను జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం, రాజేంద్రనగర్ మండల సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని 10వ తరగతి విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొని రాశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా సాంఘిక శాస్త్ర పోరం ప్రధాన కార్యదర్శి ఏ.జంగయ్య, రాజేంద్రనగర్ మండల సాంఘిక శాస్త్ర పోరం కన్వీనర్ ఆర్.అనురాధా, సి.హెచ్.అంజయ్య, మధుకర్‌రెడ్డి, ప్రభాకర్, సీతయ్య, రేణుకా, జనార్ధన్‌చారి, సి.హెచ్.అంజయ్య, జోత్స్న, ప్రసన్న లక్ష్మి, రాజు, భారతీ తదితరులు పాల్గొన్నారు. ఈ పరీక్షను అబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించి వివిధ మాధ్యమాలపరంగా జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరిగింది. ఇంగ్లీష్ మీడియంలో కార్తీక్, ఆదిత్యకుమార్, రాగ భవ్య, తెలుగు మీడియంలో రాజ్‌కుమార్, భువనేశ్వరి, శివత్రివేణిలు జిల్ధాస్థాయికి ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా శంకర్ రాథోడ్ మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సంసిద్ధం చేస్తున్న సాంఘిక శాస్త్ర ఫోరం సేవలు అభినందనీయమని అన్నారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు ఇంకా బాగా చదివి రాష్ట్రస్థాయికి ఎంపికై రాజేంద్రనగర్ మండలం పేరును ముందు వరుసలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాంపల్లి ఉపాధ్యాయులు సి.హెచ్.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 500 రూపాయల విషయంలో జరిగిన ఘర్షణలో యువకుడు మృతి



గండిపేట్(క్రైం మిర్రర్): కూలీ డబ్బుల విషయంలో జరిగిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుద్వేల్ ప్రాంతానికి చెందిన సాయికుమార్ శ్రీనివాస్ వద్ద పని చేస్తున్నాడు. 500 రూపాయలను శ్రీనివాస్ సాయికుమార్‌కు చెలిల్లించాల్సి ఉంది. అదే విషయమై ఆదివారం రాత్రి 12 గంటల సయంలో ఇద్దరు గోడవపడ్డారు. ఆవేశంతో శ్రీనివాస్ పక్కనే ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హెూల్ పైకప్పుతో సాయికుమార్ తలపై బాధడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుంది

**నార్సింగి మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ వట్టినాగులపల్లి మొద్దు ధర్మపురిముదిరాజ్, దరా వెంకటేష్‌లు**

**వట్టినాగులపల్లి గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణి**



**గండిపేట్(క్రైం మిర్రర్):** సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుందని నార్సింగి మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ వట్టినాగులపల్లి మొద్దు ధర్మపురిముదిరాజ్, దరా వెంకటేష్‌లు అన్నారు. గ్రామానికి చెందిన రాసురి లలిత, పర్మల మల్లేష్‌యాదవ్, మందుముల నిఖిల్‌రెడ్డిలకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం సహాయ నిధికి ధరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు నిధులను మంజూరు చేస్తు వారికి అండగా నిలుస్తుందన్నారు. తమవంతు బాధ్యతగా సీఎం సహాయ నిధి త్వరగా వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే గ్రామంలోని అనేక మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించామని రానున్న రోజుల్లో ఈ సంఖ్యను పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శేఖర్, రసురి చంద్రయ్య, మందుముల వెంకట్‌రెడ్డి, పార్మల మధుయాదవ్, భాపన్‌సాయి తివారి తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే రీ వెరిఫికేషన్%-%బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర

**గండిపేట్(క్రైం మిర్రర్):** ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అర్హులను గుర్తించడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ వినాయక్‌నగర్ కాలనీ, 16వ డివిజన్ లక్ష్మినగర్, 5వ డివిజన్‌లో సాయిహర్ష కాలనీలలో ఇందిరమ్మ ఇండ్లు సర్వే రీ వెరిఫికేషన్ చేశారు. ధరఖాస్తుదారుల ఇంటికి వెల్లి స్వయంగా సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ నరేందర్‌రెడ్డి, పూర్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి

**బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి**



**గండిపేట్(క్రైం మిర్రర్):** కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి అందిస్తు సమస్యలను పరిష్కరిస్తానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. కార్పొరేషన్ పరిధదిలోని 1వ డివిజన్ రంగారెడ్డి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీతో పాటు ఇతర కాలనీల వాసులు సోమవారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కలనీ డ్రైనేజీ, రోడ్డు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీలను దశల వారిగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రంగారెడ్డి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులతో పర్యటించి సమస్యలను తెలుసుకోని నివేధిక రూపొందించి ప్రణాళిక బద్ధంగా పనులను చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే జరిమా

**రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమీషనర్ రవికుమార్**

**ఆరాంఘర్‌లోని బృందావన్ హెూటల్‌కు రూ.3 వేల జరిమానా.**




**గండిపేట్(క్రైం మిర్రర్):** రోడ్లపై చెత్తను వేసే వారికి ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమీషనర్ రవికుమార్ అన్నారు. రోడ్డుపై చెత్త వేస్తున్న ఆరాంఘర్ ప్రాంతంలోని బృందావన్ హెూటల్‌కు 3 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సముదాయాల్లోని చెత్తను రోడ్లపై పడేయవద్దు అన్నారు. చెత్తను నిల్వ చేసి ప్రతి రోజు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు చెత్తను అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. దుకాణాదారులు, వ్యాపారులు, ప్రజలు రోడ్లపై చెత్త వేయవద్దని సూచించారు. చెత్త వేస్తే జరిమానా భారీగా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిభావనతోనే సుఖసంతోషాలు

**రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**ఖానాపూర్‌లో ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ**

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజలంతా భక్తిభావాన్ని కలిగి ఉన్నప్పుడే సుఖసంతోషాలు లభిస్తాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గండిపేట మండల ఖానాపూర్ గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనను కూడా పూజల్లో భాగం చేసినందుకు కమిటి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్‌యాదవ్ గురుస్వామి, మహేందర్‌రెడ్డి, మల్లేష్, శేఖర్, యాదిరెడ్డి, రాజు, రైమ్స్ శ్రీకాంత్, లడ్డూయాదవ్, ధర్మయ్య, హేమంత్, శ్రీశైలం, రవి తదితరులు పాల్గొన్నారు.





## అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానకరంగా రాజ్యసభ లో మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య లు డిమాండ్ చేశారు. చిట్యాల మండల కేంద్రంలోని డా, బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో పూలమాల వేసి, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ టీ సీ మెంబర్ పామనుగుళ్ళ అచ్చాలు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ,పట్టణ కార్యదర్శి బొబ్బిలి సుధాకర్ రెడ్డి, మండల నాయకులు ఐతరాజు యాదయ్య, మెట్టు నర్సింహ,గుడిసె లక్ష్మి నారాయణ,జిట్ట స్వామి,నకిరేకంటి రాములు, వివిధ ప్రజా సంఘాల నాయకులు బొడ్డు బాబురావు,బెల్లి మల్లేశం,బద్దుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపిన

**గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల ర్యాలీ**




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు భారత మాజీ ప్రధాని , ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా భారీ ర్యాలీని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవరణ నుండి చిట్యాల జాతీయ రహదారి మీదుగా చిట్యాల ఉన్న కనకదుర్గ అమ్మవారి గుడి వరకు భారీ ర్యాలీని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి విద్యార్థులకు మన్మోహన్ సింగ్ భారతదేశానికిబి చేసిన సేవలు సేవల గురించి వివరిస్తూ,,మన్మోహన్ సింగ్ భారత ప్రభుత్వంలో ప్రధాన ఆర్థిక సలహాదారునిగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ గా మరియు ప్రణాళికా సంఘం అధ్యక్షునిగా అనేక కీలక పదవులను నిర్వహించారని, భారతదేశంలో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ చేసినటువంటి ఆర్థిక సంస్కరణలు భారతదేశాన్ని ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాయి ఇతను చేసిన సేవలకు భారత ప్రభుత్వం అరుదైన గౌరవాలను ఇచ్చిందని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి,, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పారిశుధ్య పనులను పరిశీలించిన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర




**గండిపేట్(క్రైం మిర్రర్):** పారిశుధ్య పనుల్లో ఎలాంటి సమస్యలు లేకుండా కార్మికులు విధులు నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ కిస్మత్‌పూర్ ప్రధాన రహధారి, 20వ డివిజన్‌లోని పీరంచెరువు ప్రధాన రహదారిపై జరుగుతున్న స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన ఏరియాలను పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఊడ్చాలన్నారు. పనులు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యాలపై శ్రద్ధవహిస్తు పనులను చేపట్టాలన్నారు. అలాగే 22వ డివిజన్‌లో సాయిబాబానగర్ కాలనీలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు జగన్, మోహన్‌రావు, నరేందర్, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

# మెల్‌బోర్న్ పాయె





## డబ్ల్యూటీసీ.. ఈ సారి కష్టమే!

మెల్‌బోర్న్: వరుసగా రెండుసార్లు ఫైనల్, గద గెలవకున్నా రన్నరప్‌తో సరిపెట్టుకున్నాం. నిన్నా మొన్నటిదాకా పాయింట్ల పట్టికలో అగ్రస్థానం. మరో రెండు మ్యాచ్‌లు గెలిచుంటే ఇప్పటికీ ఏ ఆందోళన లేకుండా హాయిగా లార్డ్స్‌కు టికెట్ బుక్ చేసుకునేవాళ్లమే. కానీ స్వదేశంలో కివీస్ చేతిలో అవమానకర క్లీన్‌స్వీప్‌కు తోడు ఆసీస్ పర్యటనలో ఓటములు.. మెల్‌బోర్న్‌లోనూ అదే కథ. ఇంకేముంది! డబ్ల్యూటీసీలో భారత అవకాశాలు దాదాపుగా మూసుకుపోయాయి.

## జైస్వాల్ ఔట్‌పై వివాదం



మెల్‌బోర్న్: ఓపెనర్ జైస్వాల్ ఔట్‌పై వివాదం నెలకొన్నది. కమిన్స్ బౌలింగ్‌లో కీపర్ క్యారీ క్యాచ్‌పై థర్డ్ అంపైర్ సైకత్ షర్ఫుదుల్లా నిర్ణయం దీనికి కారణమైంది.డ్రా కోసం ఆడుతున్న సమయంలో జైస్వాల్ క్యాచ్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్ విల్సన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆసీస్ డీఆర్ఎస్‌కు వెళ్లింది. పలుమార్లు పరిశీలించిన అంపైర్ సైకత్..బంతి బ్యాట్‌ను తాకినట్లు స్నికోమీటర్‌లో కనిపించకపోయినా ఔట్ అని ప్రకటించాడు. దీంతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు చీటర్ చీటర్ అంటూ పెద్దగా అరిచారు. దీన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా తీవ్రంగా తప్పుబట్టాడు.

## ఎందుకీ వివక్ష.. ఏమిటీ ద్వంద్వ ప్రమాణాలు?!

సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ అంతర్జాతీయ టెన్నిస్ సమగ్రతా సంస్థ (ఐటీఐఏ) తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. డోపీలుగా తేలిన యానిక్ సినెర్ స్వియాటెక ల ఉదంతంపై ఐటీఐఏ వ్యవహారశైలిని దుయ్యబట్టాడు. ఐటీఐఏ అవలంభిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు సిగ్గుచేటంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అదే విధంగా.. టాప్ స్టార్‌ల డోపింగ్ మరకలపై గోప్యతను పాటించి టెన్నిస్ సమాజం నుంచి నిజాన్ని దాచడంపై సరికాదని పేర్కొన్నాడు. తన కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన జొకోవిచ్.. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీతో కొత్త సీజన్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. 2009 తర్వాత బ్రిస్బేన్ ఈవెంట్ ఆడేందుకు వచ్చిన అతడు మీడియాతో మాట్లాడాడు.

### బాక్సింగ్ డే టెస్టులో భారత్ దారుణ పరాభవం

### 184 పరుగుల తేడాతో ఓటమి

### టాపార్డర్ వైఫల్యం.. ఆసీస్‌కు 2-1 ఆధిక్యం

### డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గల్లంతు!



**ఛేదించాల్సిన లక్ష్యం 340. ఆరంభంలో ముగ్గురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు వెళ్లారు. దారి చూపాల్సిన సీనియర్లు రోహిత్, కోహ్లి, రాహుల్‌ది అదే వైఫల్య గాథ. కానీ జైస్వాల్, పంత్ పోరాటంతో గెలుపు మీద ఆశలు లేకున్నా ఓటమి గండాన్నైనా తప్పించుకోవచ్చునన్న ధీమా. మూడో సెషన్ ఆట మొదలైన కొద్దిసేపటికే పంత్ మరోసారి అనవసరపు షాట్‌కు పోయి వికెట్ పారేసుకోవడంతో ఆస్ట్రేలియా పుంజుకుంది. అక్కడ్నుంచి ఆతిథ్య జట్టు బౌలర్లు పట్టు సడలించలేదు. మూడో సెషన్‌లో 34 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 7 వికెట్లను కోల్పోయిన రోహిత్ సేన మరో ఘోర అపజయాన్ని మూటగట్టుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వచ్చింది. ఓటమితో సిరీస్ నిలబెట్టుకునే అవకాశంతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకునే అవకాశాలనూ టీమ్‌ఇండియా మరింత సంక్లిష్టం చేసుకుంది.**

**మెల్‌బోర్న్:** ఏం మారలేదు! అదే కథ.. అదే వ్యథ! బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో వైఫల్యాల పరంపరను భారత క్రికెట్ జట్టు దిగ్విజయంగా కొనసాగిస్తూ మరో పరాభవాన్ని మూటగట్టుకుంది. మెల్‌బోర్న్ టెస్టులో రోహిత్ సేన 184 పరుగుల తేడాతో ఓడి సిరీస్‌ను నిలబెట్టుకునే అవకాశంతో పాటు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తునూ సంక్లిష్టం చేసుకుంది. ఆట చివరి రోజు ఆస్ట్రేలియా నిర్దేశించిన 340 పరుగుల ఛేదనలో టీమ్‌ఇండియా.. 79.1 ఓవర్లలో 155 పరుగులకు కుప్పకూలి దారుణ ఓటమి పాలైంది. ఛేదనలో యశస్వీ జైస్వాల్ (208 బంతుల్లో 84, 8 ఫోర్లు), రిషభ్ పంత్ (104 బంతుల్లో 30, 2 ఫోర్లు) తప్ప మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేక చతికిలపడ్డారు. ఆసీస్ బౌలర్లలో సారథి, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పాట్ కమిన్స్ (3/28), స్కాట్ బొలాండ్ (3/39), నాథన్ లియాన్ (2/37) పర్యాటక జట్టును కట్టడి చేశారు. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా సిరీస్‌లో చివరి టెస్టు మొదలుకానుంది.

#### వాళ్లు మారలేదు

చేయాల్సిన పరుగులు 340. ఉన్న ఓవర్లు 92. చేతిలో 10 వికెట్లు. ఛేదన తేలికైతే కాదు గానీ అసాధ్యమైతే కాదు. ఆరంభంలో వికెట్ కాపాడుకుని తర్వాత బ్యాట్ ఝుళిపిస్తే గెలిచే అవకాశాలు మెరుగయ్యేవి. అందుకు తగ్గట్టుగానే భారత ఇన్నింగ్స్ కూడా నెమ్మదిగానే మొదలైంది. మొదటి 16 ఓవర్లకు భారత్ చేసిన స్కోరు 25/0. తన స్వభావానికి విరుద్ధంగా షాట్ల జోలికి పోకుండా 39 బంతుల్లో 9 పరుగులే చేసిన కెప్టెన్ రోహిత్ శర్మ.. కమిన్స్ వేసిన ఫుల్ డెలివరీని ఆడబోయి గల్లీలో మార్ష్‌కు క్యాచ్ ఇవ్వడంతో వికెట్ల పతనం మొదలైంది. అదే ఓవర్లో కమిన్స్.. కేఎల్ రాహుల్‌నూ డకౌట్‌గా వెనక్కి పంపి భారత్‌కు డబుల్ షాకిచ్చాడు. యావత్ భారత క్రికెట్ అభిమానులు గంపెడాశలు పెట్టుకున్న ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లి (5) మరోసారి చేతులెత్తేశాడు. దీంతో లంచ్‌కు ముందే భారత్ 33/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది.

#### ఆదుకున్న యశస్వీ, పంత్

8 పరుగుల వ్యవధిలో 3 కీలక వికెట్లు కోల్పోవడంతో భారత్ ఆత్మరక్షణలో పడింది. యశస్వీకి జతకలిసిన పంత్.. అనవసరపు షాట్ల జోలికి పోకుండా డిఫెన్స్‌నే ఆశ్రయించారు. రెండో సెషన్ ఆసాంతం ఈ ద్వయం కంగారూ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంది. ఈ క్రమంలో యశస్వీ.. లియాన్ వేసిన ఓవర్లో బౌండరీతో 127 బంతుల్లో అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. టెస్టులలో అతడికిది రెండో నెమ్మదైన హాఫ్ సెంచరీ. పంత్‌ను ఔట్ చేసేందుకు ఆసీస్ బౌలర్లు ఊరించే బంతులేసినా అతడు ఏకాగ్రత కోల్పోలేదు. రెండో సెషన్‌లో ఈ జోడీ 27.5 ఓవర్లు ఆడి 79 పరుగులు చేసింది.

#### 34 పరుగుల వ్యవధిలో 'ఖేల్' ఖతం

యశస్వీ, పంత్ పట్టుదలతో డ్రా దిశగా సాగుతున్న భారత ఇన్నింగ్స్ మూడో సెషన్ తర్వాత కుదుపునకు లోనైంది. థర్డ్ సెషన్‌లో హెడ్ వేసిన 59వ ఓవర్లో నాలుగో బంతిని భారీ షాట్ ఆడబోయిన పంత్.. లాంగాన్ వద్ద మార్ష్ డైవింగ్ క్యాచ్‌తో క్రీజును వీడాడు. భారత ఓటమికి బీజం పడిందిక్కడే. ఆ తర్వాత 20 ఓవర్లలోపే టీమ్‌ఇండియా ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (1), సీనియర్ బ్యాటర్ రవీంద్ర జడేజా (2) అలా వచ్చి ఇలా వెళ్లారు. వాషింగ్టన్ సుందర్ (45 బంతుల్లో 5 నాటౌట్)తో కలిసి ఏడు ఓవర్ల పాటు వికెట్ కాపాడుకున్న యశస్వీ.. కమిన్స్ వేసిన 71వ ఓవర్లో థర్డ్ అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో వెనుదిరిగాల్సి వచ్చింది. లోయరార్డర్ బ్యాటర్లూ పోరాడకపోవడంతో భారత్.. 155 పరుగులకు ఆలౌట్ అయింది. ఒక దశలో 121/3తో పటిష్ఠంగా ఉన్న రోహిత్ సేన.. 34 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది.

#### సంక్షిప్త స్కోర్లు

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474 ఆలౌట్‌బీ**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 369 ఆలౌట్‌బీ**

**ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 234 ఆలౌట్‌బీ**

**భారత్ రెండో ఇన్నింగ్స్: 79.1 ఓవర్లలో 155 ఆలౌట్ (జైస్వాల్ 84, పంత్ 30, కమిన్స్ 3/28, బొలాండ్ 3/39)**



## గోటితోపోయే దానిని గొడ్డలిదాకా తెచ్చారు

### సంధ్య థియేటర్ ఘటనపై పవన్ వ్యాఖ్య



**గుటూరు,(క్రైమ్ మిర్రర్):** గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించారు. మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడుని, కిందిస్థాయి నుంచి ఎదిగారని కితాబునిచ్చారు. వైకాపా విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుందని అన్నారు. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సిందని అన్నారు. అల్లు అర్జున్ తరపున ఎవరో ఒకరు బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉంటే బాగుండేది. ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు. మేమంతా అండగా ఉన్నామని ముందే చెప్పి ఉండాల్సింది. తమ ప్రమేయం లేకుండా తప్పు జరిగి పోయిందని విచారం వ్యక్తం చేయాల్సింది.

# ఏపీకి మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు

### క్లీన్ ఎనర్జీ పాలసీతో ఏపీకి పలు సంస్థలు క్యూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీలో పలు ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబు రూపకల్పన చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఏపీకి మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. పెట్టుబడులు ఏపీకి రావడం వల్ల 2,63,411 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి క్లీన్ ఎనర్జీ పాలసీతో ఏపీకి పలు సంస్థలు క్యూ కడుతన్నాయి. ఎస్ఐపిఎస్ సమావేశంలో పెట్టుబడులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచమంతా ఇప్పుడు గ్రీన్ ఎనర్జీవైపు పయనిస్తుందని తెలిపారు. ఏపీ ఆ దిశగా ఆలోచనలు చేయాల్సి ఉందన్నారు. యూనిట్ విద్యుత్ ధర రూ.5.18 నుంచి రూ.4.80కు తగ్గించడం లక్ష్యమని చెప్పారు. యూనిట్ విద్యుత్ ధర తగ్గించేందుకు వినూత్న యోచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో విద్యుత్ రంగంలో వినూత్న మార్పు చూస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ప్రజాభిప్రాయానికి తగ్గట్టే పాలన ఉంటుందని తెలిపారు. అధికారులు తమ పనితీరుతో ప్రజలను మెప్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీంతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు దేశ, విదేశీ కంపెనీలు సైతం క్యూ కట్టాయి. అందులోభాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో



ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి లూలు సంస్థ వెళ్లి పోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం తెలిపింది. ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా ఏపీలో తన సంస్థలను ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. అయితే వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి వచ్చింది లేదు. అలాగే లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో.. ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలి వెళ్లారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు గ్రహించారు. అందుకే.. ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలు ఏర్పాటుకు దేశవిదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

## ఎపిలో భారీగా పెరిగిన లిక్కర్ ఆదాయం

### 6,312 కోట్ల రూపాయల మద్యం అమ్మకం

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ సేల్స్ భారీగా పెరిగాయని ఎక్సైజ్ శాఖ చెబుతోంది.. ఏపీ వ్యాప్తంగా భారీగా లిక్కర్ అమ్మకాలు జరిగినట్టు అధికారులు చెబుతున్నారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. అప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం షాపులకు గుడ్‌బై చెప్పి ప్రైవేట్ వైన్ షాపులకు అనుమతి ఇచ్చిన విషయం విదితమే.. టెండర్లకు ఆహ్వానించి.. ఆ తర్వాత లిక్కర్ షాపులకు కేటాయించగా.. ఈ ఏడాది అక్టోబర్ 16వ తేదీ నుంచి ప్రైవేట్ లిక్కర్ షాపులు అందుబాటులోకి వచ్చాయి.. అయితే, అక్టోబర్ 16వ తేదీ నుంచి నిన్నటి వరకు అంటే డిసెంబర్ 29వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 6,312 కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్టు ఏపీ ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.. ఈ 75 రోజుల కాలంలో 26,78,547 కేసులు బీర్ల అమ్మకాలు సాగగా.. 83,74,116 కేసుల మద్యం అమ్మినట్టు చెబుతున్నారు. బార్లు, వైన్ షాపులకు కలిపి ఈ అమ్మకాలు జరిగినట్టు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.. ఇక, డిసెంబర్ 31, జనవరి 1కి సంబంధించి వచ్చిన ఇండెంట్ బట్టి ఈ రోజుకి ఆరోజు సరుకు పంపుతున్నట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.. మరోవైపు.. డిసెంబర్ 30, 31 తేదీలతో పాటు.. 2025 జనవరి 1వ తేదీనా మద్యం అమ్మకాలు మరింత భారీగా సాగుతాయనే అంచనాలు వేస్తున్నారు..

## ఉగాది నుంచి ఉచిత బస్సు ప్రయాణం

### ఉన్నతస్థాయి సమీక్షలో చంద్రబాబు

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలోని మరో హామీని నెరవేర్చే దిశగా ఏపీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే దిశగా చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు పలువురు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు కీలక చర్చలు జరుపుతున్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీఎండీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అంశంపై తీసుకుంటున్న చర్యలపై సీఎం ఆరా తీశారు. ఈ విధానం అమల్లో ఉన్న కర్ణాటక, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తామని అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను వీలైనంత త్వరగా అందజేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఉగాది నాటికి పథకం అమల్లోకి తెచ్చేలా పనులు వేగవంతం చేయాలని దిశానిర్దేశర చేశారు.

## న్యూఇయర్ వేడుకలకు శృతిమించితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



**తిరుపతి, (క్రైమ్ మిర్రర్):** గత ఆరునెలల్లో తిరుపతి జిల్లాలో క్రైం రేటు బాగా తగ్గిందని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. పటిష్టమైన పకడ్బందీ భద్రతా ఏర్పాట్లతో నేరనియంత్రణ చేలగలిగామన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు వివరిస్తూ పూర్తి స్థాయి అవగాహన కల్పించామన్నారు. యువతలో మార్పు తీసుకువచ్చామన్నారు. సైబర్ నేరాలు పెరిగాయని.. కానీ సైబర్ నేరాలకు పాల్పడిన నేరస్తులను అరెస్టులు చేసి బాధితులకు న్యాయం చేశామన్నారు. సైబర్ క్రైం వారోత్సవాలను కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో నిర్వహించామని చెప్పారు. తిరుమల పర్యటనకు వచ్చిన వీఐపీలందరికీ పటిష్టమైన భద్రత కల్పించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా వ్యవహరించామన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని సంచలనాత్మక కేసులను త్వరితగతిన చేధించానమన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్నామని... పీడీ యాక్ట్‌లు పెట్టడంతో స్మగ్లర్లు వెనక్కి తగ్గారన్నారు. హోంస్టేలపై ప్రత్యేక నిఘా పెంచామని... అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా అడ్డుకట్ట వేశామన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఆరునెలల్లో ఏడు శాతం కేసులు తగ్గాయని ఎస్పీ వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకలను జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు.

## పేర్ని నాని భార్య జయసుధకు ఊరట

### ముందస్తు బెయిల్ ఇచ్చిన జిల్లా కోర్టు



**మచిలీపట్నం,(క్రైమ్ మిర్రర్):** మాజీ మంత్రి పేర్ని నాని భార్య జయసుధకు మచిలీపట్నం కోర్టులో ఊరట దక్కింది.. అయితే విచారణకు సహకరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని భార్య జయసుధ మచిలీపట్నం కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. గత వారం విచారణ ముగించిన జిల్లా కోర్టు.. విచారణను వాయిదా వేసిన విషయం విదితమే.. అయితే, బియ్యం మాయం కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది కోర్టు.. ఈ కేసులో విచారణకు సహకరించాలని జయసుధకు ఆదేశాలు జారీ చేసింది.. కాగా, ఏ2 మేనేజర్ మానస తేజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. మరోవైపు.. గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయమైన వ్యవహారంలో జయసుధకు మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు.. మొదట 185 మెట్రిక్ టన్నుల బియ్యం మాయం అయ్యాయంటూ రూ.1.68 కోట్ల జరిమానా విధించగా.. ఆ తర్వాత మరిన్ని బస్తాల బియ్యం మాయమైనట్టు గుర్తించారు. మొత్తంగా గోడౌన్ నుంచి 378 మెట్రిక్ టన్నుల బియ్యం మాయం అయ్యాయని చెబుతున్నారు అధికారులు.. అయితే, ఈ కేసు వెలుగు చూసిన తర్వాత మాజీ మంత్రి పేర్నినాని కుటుంబం మొత్తం అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం విదితమే.. కొన్నిసార్లు పేర్నినాని కనిపించినా.. ఆయన ఫ్యామిలీ మొత్తం అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న విషయం విదితమే.. వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోదాములో బియ్యం మాయం కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఆదివారం గోదాము మేనేజర్ మానస తేజను, సోమవారం కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కోటి రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కోటి రెడ్డికి ప్రమేయముందని పోలీసుల అనుమానిస్తున్నారు. పేర్ని నాని గోదాములో రేషన్ బియ్యం మాయమయ్యాయని కోటి రెడ్డి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యం నిల్వల మాయం అంశంలో తనపై అనుమానం రాకుండా పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.

## తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల రద్దీ సాదారణంగా ఉంది. సోమవారం వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఒక కంపార్టుమెంట్ లోనే భక్తులతో వేచి ఉన్నారు. ఈ క్రమంలో టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి కేవలం 6 గంటల సమయం మాత్రమే పడుతుంది. కాగా, ఆదివారం వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. నిన్న శ్రీవారిని 84,950 మంది భక్తులు దర్శించుకుని ముక్కులు తీర్చుకున్నారు. 21,098 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. టిటిడి హుండీ ఆదాయం రూ.3.8 కోట్లుగా ఉందని అధికారులు వెల్లడించారు.

## మల్లన్న సేవలో గవర్నర్ సతీమణి

**నంద్యాల,(క్రైమ్ మిర్రర్):** శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ సోమవారం దర్శించు కున్నారు. ముందుగా గవర్నర్ భార్యకి శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఆలయ మర్యాదలతో వేద పండితులు, అర్చక స్వాములతో ఘన స్వాగతం పలికారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సందర్శించిన అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనము చేయగా ఆలయ ఈవో స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని గవర్నర్ సతీమణి కి అందజేశారు.

## మంత్రి వాసంశెట్టి సుభాష్, వైసీపీ ఎంపీ పిల్లి బోస్ మధ్య మాటాల తూటాలు



**కోనసీమ జిల్లా, (క్రైమ్ మిర్రర్):** జిల్లాలోని రామచంద్రాపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ వర్సెస్ వైసీపీ ఎంపీ పిల్లి బోస్ అన్నట్లుగా పరిస్థితులు మారాయి. నిన్న (ఆదివారం) మంత్రి సుభాష్ విసిరిన సవాల్‌కు స్పందనగా ఓపెన్ డిబేట్‌కు వైసీపీ ఎంపీ సిద్ధమయ్యారు. తన ఆరు నెలల పాలనలో అభివృద్ధి, గత ఐదేళ్ల వైసీపీ అవినీతిపై డిబేట్‌కు రావాలని బోస్‌కు మంత్రి సవాల్ విసిరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. " బహిరంగ డిబేట్ ఎక్కడ? ఎప్పుడు ఏర్పాటు చేసినా నేను, నా కుమారుడు వస్తాము" అని సవాల్ విసిరారు. ప్రజల్ని తాము పీడించలేదని.. టీడీపీ కార్యాలయంలో డిబేట్ పెట్టినా రావడానికి సిద్ధమని బోస్ స్పష్టం చేశారు. "మీ నాయకుడు ఉత్తముడుగా చేయడం లేదు.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు" వీటిపై చర్చిద్దాం రమ్మంటూ మంత్రికి బోస్ ఛాలెంజ్ చేశారు.

# కాశ్మీర్‌ను కప్పేసిన మంచు దుప్పటి

### యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా

**శ్రీనగర్,(క్రైమ్ మిర్రర్):** కాశ్మీర్‌లో హిమపాతం కారణంగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో అక్కడి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసింది. డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు. కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడించారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి. వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదే సమయంలో సింథాన్ రోడ్, సోన్‌మార్గ్-కార్గిల్ రోడ్, భదేర్వా-చంబా రోడ్‌తో పాటు జిల్లా రాజోరి, పూంచ్ నుంచి షోపియాన్ (కశ్మీర్) వరకు కలిపే మొఘల్ రోడ్‌లు ఇంకా మంచుతోనే ఉన్నాయి. వీటిని ఇంకా తెరువలేదు. వాతావరణం మెరుగుపడిన తరువాత శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు పునఃప్రారంభించబడ్డాయి. పర్యాటకులు, ప్రయాణికులు ట్రాఫిక్ విభాగం సలహా ప్రకారం ప్రయాణించాలని సూచించారు. అలాగే నేటి నుంచి రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించారు. అయితే ఈ రోజు విస్టాడోమ్ సేవలు రద్దు చేయబడ్డాయి. ఈ క్రమంలో లోయలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంది. ఆదివారం రాజధాని శ్రీనగర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 4.7 డిగ్రీల నుంచి 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. పహల్గామ్‌లో 5.8 డిగ్రీలు, గుల్‌మార్గ్‌లో 5.3 డిగ్రీల నుంచి మైనస్ 2.0 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. జమ్మూలో గరిష్ట ఉష్ణోగ్రత 20.5 కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 6.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బనిహాల్‌లో 6.1 డిగ్రీల సెల్సియస్, బాటోట్‌లో 7.9, కత్రాలో 18.0, భదర్వాలో 10.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. లేహ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 0.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గుల్మార్గ్‌లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువగా ఉండటం విశేషం.

## పోరాడుతూ మరణించాలంతే!

“తల్లి ఆశీర్వాదం బిడ్డకు ఎప్పుడూ తోడుంటుందంటారు. కానీ నా బిడ్డ విషయంలో మాత్రం అది శాపంగా మారింది” అంటోంది ఓ తల్లి. మరి ఆమె ఆశీర్వాదం తన బిడ్డకు ఎందుకు శాపంగా మారిందో తెలుసుకోవాలంటే ‘గాంధారి’ సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయిక తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. దేవాశిశ్ మఖిజా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైనట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకుంది తాప్సి “సమయం వచ్చినప్పుడు నేను యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతూ మరణించాలి. కానీ ఎప్పుడూ శత్రువుల ముందు భయం ప్రదర్శించొద్దు. ఇప్పుడు పోరాటం ప్రారంభిద్దాం” అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో ప్రతీకారం తీర్చుకునే ఓ శక్తిమంతమైన తల్లిగా కనిపించనుందామె. ఈ చిత్రాన్ని కనికా థిల్లాన్ నిర్మిస్తోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది చిత్రబృందం.




# ఈసారి ఆ తప్పు జరగదు..



ప్రభాస్ ‘సలార్’ సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమా చివర్లో దర్శకుడు ప్రశాంత్‌నీల్ ‘సలార్ 2 %-% శౌర్యాంగపర్వం’ను కూడా ప్రకటించేశాడు. దాంతో అభిమానులు సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికోసం ‘సలార్ 2’ అప్‌డేట్‌ని ఇచ్చేశారు ప్రశాంత్‌నీల్. ఆయన మాట్లాడుతూ ‘ ‘సలార్’ భారీ విజయాన్ని సాధించినా.. ఒక దర్శకుడిగా ఆ సినిమా విషయంలో పూర్తి సంతృప్తిగా లేను. ఎక్కడో ‘కేజీఎఫ్’ ఛాయలు ఆ సినిమాలో కనిపిస్తుంటాయి. ‘సలార్ 2 %-% శౌర్యాంగపర్వం’లో మాత్రం ఆ తప్పు జరగదు. ఓ కొత్త సినిమాను ప్రేక్షకులు చూస్తారు.’ అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ ‘ఈ కథ రాసుకున్నప్పుడే రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇది దేవా- వరదా అనే ఇద్దరు స్నేహితుల కథ. మలుపులు, కుదుపులు లేకపోతే కథ రక్తికట్టదు. స్నేహం సాఫీగా సాగితే కిక్కుండదు. అందుకే.. కష్టమైనా సరే.. వారిద్దర్నీ విడగొట్టాలి. వారి మధ్య ఓ పెద్ద అపార్థం సృష్టించాలి. ఒకరినొకరు అపార్థం చేసుకోవాలి. శత్రువులుగా మారాలి. ఈ తర్వాత ఏమైంది? అనేది తెరపైనే చూడాలి. దాన్ని ఇప్పుడే రివీల్ చేయలేను.’ అంటూ నవ్వేశారు ప్రశాంత్‌నీల్.

## అది నిజంగా నా విజయమే



‘యానిమల్’కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ ‘యానిమల్’ తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాలభామ మరో అఛీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్స్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ‘నా గురించి తెలుసుకోవాలని ఇంతమంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం ‘యానిమల్’. థ్యాంక్యూ సందీప్ సార్. ‘యానిమల్ 2’ కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.’



## క్రికెట్‌కి సచిన్.. ఇండియన్ సినిమాకు శంకర్

‘శంకర్‌గారు కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా. క్రికెట్‌కు సచిన్ ఎలాగో, ఇండియన్ సినిమాకు శంకర్‌గారు అలా. అలాంటి శంకర్‌గారితో పనిచేయడం నా అదృష్టం. నానుంచి సోలో ఫిల్మ్ వచ్చి అయిదేళ్లయింది. ఇది నాకు ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపరచదు.’ అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం ‘గేమ్ ఛేంజర్’. ఎస్.శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికా డల్లాస్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్ర దర్శకుడు సుకుమార్ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ “రంగస్థలం’కు రామ్‌చరణ్ జాతీయ అవార్డు తీసుకుంటాడని ఆశించా. కానీ రాలేదు. అయితే.. ‘గేమ్ చేంజర్’ ట్కక్లైమాక్స్ చూశాక, ఈ సినిమాలోని రామ్‌చరణ్ నటనకు పక్కాగా జాతీయ అవార్డు వస్తుందనిపించింది.’ అని తెలిపారు. ‘మా సంస్థలో ఇది 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్ సినిమా తీయడం ఇదే ప్రథమం. శంకర్‌గారి సినిమా సెల్‌ఫోన్‌లో చూస్తే ఫీల్ రాదు. దాన్ని బిగ్ స్క్రీన్‌పైనే ఎక్స్‌పీరియన్స్ చేయాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ అంశాలు ఈ సినిమాలో చాలా కనిపిస్తాయి. శంకర్‌గారు అన్నీ తానై నడిపించారు. ఈసారి మామూలుగా కొట్టడంలేదు. గట్టిగా కొట్టబోతున్నాం.’ అని దిల్‌రాజు నమ్మకం వ్యక్తం చేశారు. శంకర్ మాట్లాడుతూ ‘పోకిరి, ఒక్కడు లాంటి మాస్ మసాలా సినిమా చేయాలి.. కానీ అందులో కూడా నా మార్క్ ఉండాలి అనుకొని ఈ ‘గేమ్‌ఛేంజర్’ చేశాను. ప్రభుత్వోద్యోగి, పొలిటీషియన్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. రామ్‌చరణ్ సెటిల్డ్‌గా చేశాడు. పంచెకట్టులో అప్పన్నగా అదరగొట్టేశాడు. ఈ సినిమాకి అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. రేపు ఆ కష్టాన్ని తెరపై చూస్తారు.’ అని శంకర్ చెప్పారు. ఇంకా అంజలి, సంగీత దర్శకుడు తమన్, నిర్మాత అనిల్ సుంకర, డైరెక్టర్ బుచ్చిబాబు, ఎస్‌జే సూర్య కూడా మాట్లాడారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.